


సత్తుపాటి ప్రసన్నశ్రీ


చేకూరి శివరామకృష్ణ ప్రసాద్

# ప్రజాస్వామ్యం ఖూ(తు)నీ!


ఉద్రిక్తత : తుని బాలాజీ కాంప్లెక్స్ వద్ద బారికేడ్లను తోసుకున్న కార్యకర్తలపై లాఠీచార్జి

ఓటమి పాలైనా వైసీపీ నాయకులు మారలేదు.. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సుమారు 17 మంది కౌన్సిలర్లను బంధించి గత రెండు రోజులుగా స్వేచ్ఛను హరిస్తున్నారు.. మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చినా భేఖాతర్ చేస్తున్నారు.. ఎన్నికలు జరిగే మునిసిపల్ కార్యాలయాన్ని ఆనుకుని ఎడమ వైపున ఉన్న చైర్మన్ నివాసంలో వైసీపీ కౌన్సిలర్లను బంధించారు. కళ్లెదుటే కౌన్సిలర్లు ఉన్నా వేలాదిగా ఉన్న పోలీసులు.. అధికారం చేతిలో ఉన్న కూటమి నాయకులు వారు ఎప్పుడొస్తారోనని ఎదురుచూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. తునిలో కళ్లెదుటే వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు..

## తునిలో వైసీపీ అరాచకీయం

- మళ్లీ వైసీపీ నేతల డ్రామాలు
- హాజరైన టీడీపీ కౌన్సిలర్లు
- వైసీపీ కౌన్సిలర్ల నిర్బంధం
- బయటకొచ్చిన కౌన్సిలర్లు
- లాక్కుపోయిన రాజా
- కోరం లేక మళ్లీ వాయిదా
- నాలుగోసారీ అంతే
- తేలని వైస్ చైర్మన్ ఎన్నిక
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చలో తునికి వైసీపీ నేతలు
- అడ్డుకున్న పోలీసులు

కాకినాడ/ తుని రూరల్ (ఆంధ్రజ్యోతి) : మళ్లీ అదే సీను.. అదే డ్రామా.. ఎన్నికకు హాజరైతే ఓడిపోతామనే భయంతో అవే కుయుక్తులు.. కౌన్సిలర్ల నిర్బంధాలు.. అడుగు పెట్టనీయకుండా వారిపై ఆంక్షలు.. చివరకు మళ్లీ నాలుగోసారీ వాయిదా.. వైసీపీ డ్రామాలతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఎటూ తేలకుండా సా..గుతోంది. చివరకు మంగళవారమైనా ఉత్కంఠకు తెరపడుతుందని భావిస్తే మళ్లీ సేమ్.. వైసీపీ తీరుతో కోరం లేని కారణంగా వాయిదా.. దీంతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎప్పటికి పూర్తవుతుందోనన్న ఆందోళన.. చలో తునికి అనుమతి లేకపోయినా పలువురు వైసీపీ నేతలు ఇంకో డ్రామాకు తెరలేపగా పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపారు.

### మళ్లీ అదే రిపీటు..

తుని మునిసిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రోజు రోజుకు ఉత్కంఠభరితంగా మారుతోంది. కోరం లేక సోమవారం ఎన్నిక రద్దవగా, తిరిగి మంగళవారం కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. వాస్తవానికి తునిలో ఖాళీ అయిన వైస్ చైర్మన్ ఎన్నికకు ఈనెల 3న నోటిఫికేషన్ జారీ అయింది. వైసీపీ డ్రామాల కారణంగా ఈనెల 3,4 తేదీల్లో జరగాల్సిన ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. తాజాగా కోర్టు ఆదేశాలతో సోమవారం ఎన్నికకు వీలుగా అధికారులు కౌన్సిలర్లను ఆహ్వానించారు. టీడీపీ నుంచి పది మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాగా వైసీపీ కౌన్సిలర్లు 17 మందిని ఆ పార్టీ నిర్బంధించి ఓటింగ్‌కు రాకుండా చేసింది. కోరం లేకపోవడంతో ఎన్నికను రద్దు చేసి మంగళవారం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.దీంతో మంగళవారం ఉదయం 11 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు 10 మంది ఎన్నికకు హాజరయ్యారు. వైసీపీ కౌన్సిలర్లు వస్తారని అంతా భావించారు. కానీ వైసీపీ తన డ్రామాను మళ్లీ కొనసాగించింది. ఉదయం 8 గంటలకే తమ కౌన్సిలర్లను వైసీపీ మునిసిపల్ చైర్మన్ నివాసానికి తరలించింది. కాసేపటికే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అక్కడకు చేరుకుని ఎన్నికకు వెళ్లొద్దంటూ బెదిరించారు. మరో పక్క ఉదయం 10 గంటలు అవగానే తుని టీడీపీ కార్యకర్తలు,నాయకులు మునిసిపాలిటీ వద్దకు చేరుకున్నారు. వీరిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కొందరు వైసీపీ కౌన్సిలర్లను దాచిపెట్టిన చోటు వైపు వెళ్లే ప్రయత్నం చేయగా పదుల సంఖ్యలో పోలీసులు మోహరించి బారికేడ్లు అడ్డంపెట్టేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. సరిగ్గా ఉదయం 10:30 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు పది మంది మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వీరి ధ్రువీకరణ పత్రాలను సరిచూసి అధికారులు 11 గంటలకు లోపలకు పంపారు. కానీ వైసీపీ కౌన్సిలర్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని వైసీపీ కౌన్సిలర్లు ఉన్న ప్రాంతం వైపు చొచ్చుకువెళ్లడానికి పరుగులు తీశారు. వైసీపీ కౌన్సిలర్లను నిర్బంధించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ ఉన్న వైపు టీడీపీ శ్రేణులు దూసుకువెళ్లే ప్రయత్నం చేశాయి. ఎన్నికకు కౌన్సిలర్లను పంపాలని వైసీపీని నిలదీసేందుకు టీడీపీ నేతలు పలుసార్లు ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ శ్రేణుల వైపు దూసుకురావడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఘర్షణ నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.


మేము ఇక్కడే ఉన్నాం : చైర్‌పర్సన్ నివాసం నుంచి బయటకొచ్చిన వైసీపీ కౌన్సిలర్లు

### ఇలా రాగానే.. అలా లాక్కుపోయారు..!

ఎన్నిక మరికాసేపట్లో ప్రారంభం కానుండగా వైసీపీ కౌన్సిలర్లు కొందరు నిర్బంధం నుంచి బయటకొచ్చి సమావేశానికి వచ్చే ప్రయత్నం చేశారు. టీడీపీ నేతలు వారి వైపు దూసుకెళ్లారు. గమనించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ వారిని తమ మనుషులతో లోపలకు లాక్కుపోయారు. సమయం 12 గంటలు దాటిపోయినా వైసీపీ కౌన్సిలర్లు రాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేశారు.


మేము వచ్చేశాం : హాజరైన టీడీపీ కౌన్సిలర్లు

### ఇక ఈసీ నిర్ణయమే..

మళ్లీ ఎప్పుడు ఎన్నిక జరుగుతుందనేది ఈసీ నిర్ణయిస్తుందని అధికారులు వివరించారు. ఇప్పటికే ఎన్నిక నాలుగుసార్లు వాయిదా పడడంతో ఈ విషయాన్ని కలెక్టర్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో రెండు సార్లు కోరం లేక వాయిదాపడినందున తదుపరి నిర్వహించే ఎన్నిక కోరంతో సంబంధం లేకుండా నిర్వహించొచ్చా? లేదా?అనే దానిపై ఈసీ త్వరలో నిర్ణయించే అవకాశం ఉంది.


అనుమతి లేదన్నా వచ్చేసి : నేలపై బైఠాయించి ద్వారంపూడి, కన్నబాబు, ఇతర వైసీపీ నాయకుల నిరసన

### చలో తుని.. మరో డ్రామా..

ఒక పక్క ఎన్నిక జరగకుండా అడ్డుకుంటున్న వైసీపీ.. మంగళవారం చలో తునికి రావాలంటూ దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. పోలీసులు చలో తునికి అనుమతి లేదని తెగేసి చెప్పారు. తొలుత కిర్లంపూడి నుంచి ముద్రగడ పద్మనాభరెడ్డి తునికి బయలుదేరగా తుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో పోలీసులు అడ్డుకోగా వెనుదిరిగి వెళ్లిపోయారు. అటు మాజీ ఎంపీ వంగా గీత తునిలో హల్‌చల్ చేశారు. అనుమతి లేదని చెప్పినా రాజా వద్దకు వెళ్లి కౌన్సిలర్లతో మాట్లాడారు. కాకినాడ నుంచి మాజీ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు తునికి వెళ్లే ప్రయత్నం చేయగా గొల్లప్రోలు హైవేపై పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా తుని వచ్చిన మాజీ ఎంపీ వంగా గీతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తునిలో గొడవలు జరిగే అవకాశం ఉండడంతో నియోజకవర్గంలో మాజీ మంత్రి దాడిశెట్టితోపాటు పలువురు నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

## రెండు వర్సిటీలకు వీసీల నియామకం

కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థను గాడిలో పెట్టే చర్యలకు దిగింది.. ఎట్టకేలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు మంగళవారం వీసీ (వైస్ చాన్సలర్ల) నియామకం చేపట్టింది.. కాకినాడలో ఉన్న జేఎన్‌టీయూకే వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ జిల్లా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు.. గుంటూరు జిల్లాకు చెందినవారు. ఇక తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఉన్న నన్నయ వర్సిటీ వీసీగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం విశాఖపట్నం ఏయూలో ఆంగ్ల విభాగ ప్రొఫెసర్‌గా ఉన్నారు.. 19 గిరిజన భాషలకు లిపి రూపొందించి 2022లో అప్పటి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారం అందుకున్నారు. వీరిద్దరూ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. - వివరాలు 6లో



## ప్రకృతి వ్యవసాయంలో 7,300 మంది

### దొమ్మేరులో పరిశీలించిన కలెక్టర్

కొవ్వూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయవచ్చునని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో రైతు నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ సాగును వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు.12 ఎకరాల పొలంలో చెరకు, బొప్పాయి, మొక్కజొన్న, నువ్వులు, అరటి, కోకో, కొబ్బరి, కంద, డ్రాగన్ ఫ్రూట్, జామ రకాల పంటలను సాగు చేయడంపై అభినందించారు. డ్రోన్ సహాయంతో కషాయం పిచికారి చేసే విధానాన్ని స్వయంగా వీక్షించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 42 వేల ఎకరాల్లో 7300 మంది రైతులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, కొవ్వూరు ఆర్డీవో డా.రాణి సుస్మిత, కొవ్వూరు ఏపీసీఎన్ఎఫ్, డీపీఎం బి.తాతారావు, అదనపు డీపీఎం మహబూబ్ వలీ, వ్యవసాయశాఖ ఏడి పి.చంద్రశేఖర్ రైతులు పాల్గొన్నారు.

## జీబీఎస్ అంటువ్యాధి కాదు డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి



కొవ్వూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జీబీఎస్ వ్యాధిని సమయానికి గుర్తించి చికిత్స అందిస్తే కోలుకుంటారని డీసీహెచ్ఎస్ డా.ఎన్.పద్మశ్రీరాణి అన్నారు. కడియం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం సీహెచ్‌సీలు,అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు, వైద్యులతో మంగళవారం సమీక్షించారు.జీబీఎస్ వ్యాధి (గిల్లియన్ బరే సిండ్రోమ్) ఒక అరుదైన నాడీ సంబంధిత వ్యాధి.మన శరీరపు రోగ నిరోధక వ్యవస్థ పొరపాటుగా మన నరాలపై దాడి చేయడం వల్ల కలుగుతుందన్నారు.కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల తర్వాత వ్యాధి వస్తుందన్నారు.వ్యాధి సోకితే చేతులు, కాళ్లలో నిస్సత్తువ. కాలి వేళ్ల నుంచి పైభాగానికి వస్తూ పెరిగే బలహీనత. కొన్ని సార్లు శ్వాస సమస్యలు తలెత్తుతాయన్నారు.మహారాష్ట్రకర్ణాటక,ఏపీలలో అత్యధికకేసులునమోదయ్యాయన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదన్నారు.ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించి సురక్షిత నీరు తాగాలన్నారు.

### ఒక జీబీఎస్ అనుమానిత కేసు కాకినాడకు పంపించాం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అనుమానిత లక్షణాలతో కాకినాడకు తరలించిన వ్యక్తికి సంబంధించి వ్యాధి నిర్ధారణపై ఎటువంటి అధికారిక వైద్య నివేదిక అందుబాటులో లేదని జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ పేర్కొన్నారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యికి చెందిన సదరు వ్యక్తి ఆరోగ్యపరిస్థితిని నిరంతరం గమనిస్తూనే ఉన్నామని తెలిపారు. ఆయన పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. జీటీజీహెచ్‌కు వచ్చిన రెండు కేసుల్లో ఒక దాన్ని అనుమానిత కేసుగా గుర్తించి న్యూరాలజిస్ట్ సలహా మేరకు ఈనెల 14న కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశామన్నారు.

### నేడు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్‌ఈ) ఎస్.శాంతి ప్రియ తెలిపారు. జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న పెన్షన్,జీపీఎఫ్ కేసులను సమీక్షిస్తామన్నారు. జిల్లాలో అధికారులు పెండింగ్‌లో ఉన్న కేసులు, అనుబంధ సమస్యలకు సంబంధించిన వివరాలతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఖజానా అధికారి ఎస్.సత్యనారాయణ కోరారు.

## రైతుకు గిట్టుబాటు ధర ఇప్పించాలి

### ఉమ్మడి జిల్లా రైతుబజార్ల ఎస్టేట్ అధికారులతో జేడీ సుధాకర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులను ఆదుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ అన్నారు. రాజమహేంద్రవరం ఏఎంసీ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మార్కెటింగ్‌శాఖ అధికారులు, రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు, మార్కెట్ కమిటీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. కూరగాయల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో వంకాయలు, టమోటా, కేబేజీ తదితర కూరగాయల దిగుబడులు గణనీయంగా పెరిగాయని..రేటు పడిపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. జిల్లాల్లో వాటి లభ్యతను బట్టి మార్కెట్‌లో రైతుకు రేటు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రైతు ఎవరైనా సరే వారు పండించే పంటకు బహిరంగ మార్కెట్లలో గిట్టుబాటు ధర రానప్పుడు మార్కెటింగ్‌శాఖ వారి ఉత్పత్తులను రైతుబజార్లలో విక్రయించుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ మేరకు మార్కెటింగ్, ఎస్టేట్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్, కాకినాడ జిల్లా ఏడీఎం రాఘవేంద్రరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏడీఎం విశాలాక్షి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



### సాయుధ బలగాల కవాతు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణం పోలీసు కవాతు మైదానంలో మంగళవారం సాయుధ బలగాల వార్షిక డీ-మోబిలైజేషన్ కవాతు నిర్వహించారు.గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ సాయుధ బలగాలు అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా వ్యవహరించడానికి,వృత్తి నైపుణ్యం మెరుగు పరిచి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి డీ-మోబిలైజేషన్ శిక్షణ ఉపకరిస్తుందన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మురళీకృష్ణ,అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్.అర్జున్,అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్.చెంచి రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యంపై వేటు
రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు.. ఐదుగురు ఉద్యోగులు సస్పెన్షన్ 7

స్టాక్ మార్కెట్ పేరుతో రూ.14 లక్షలకు టోకరా 7

టీబీ ముక్త్ పంచాయతీల క్లెయిమ్స్ వెరిఫికేషన్ 8

## ప్రాణాలు పోతున్నా..


హృదయ విదారకం : పండ్ల మార్కెట్ వద్ద లారీ ఢీకొనడంతో సోమవారం రోడ్డు పక్కనే మృతిచెంది పడి ఉన్న తోటి కోడళ్లు

ఒక ప్రమాదం.. ఇద్దరు మృతి.. మృతదేహాలను తరలించేశారు.. కేసు నమోదు చేశారు.. అక్కడితో అయిపోయిందంతే..! అసలు ప్రమాదం జరగడానికి కారణం .. కారకులు ఎవరు.. అనేది అధికారులు తేల్చడం లేదు.. సోమవారం దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన తోడికోడళ్లు మృతిచెందిన ఘటన విధితమే.. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి.. ప్రాణాలు పోతూనే ఉంటాయి. అటూ ఇటూ లేదంటే నెలకూ సుమారు 100 వరకూ ప్రమాదాలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది అధికార యంత్రాంగం ఉన్నా.. ఒక్కరూ ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలు మాత్రం శూన్యం.. ఇక్కడ ప్రమాదాలు జరగడానికి అసలు కారణం ఏంటో తెలుసా.. ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడమే!

# పట్టదా!?

## ప్రమాదకరంగా దివాన్‌చెరువు జంక్షన్

- ప్రతి నెలా పెరుగుతున్న ప్రమాదాలు
- సర్వీసు రోడ్లు లేకపోవడమే కారణం
- ఆందోళనలో ప్రయాణికులు
- కన్నెత్తి చూడని అధికారులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు మాత్రం పట్టడంలేదు.. షరా మామూలే అన్నట్టు వదిలేస్తున్నారు. ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలు మాత్రం శూన్యంగా ఉంటున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ప్రయాణం ఆందోళన కలిగిస్తోంది. వివిధ పట్టణాలు, నగరాలను కలిపే ఈరహదారిపై రేయింబవళ్లు వాహనాలు రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది.

### జీరో జంక్షన్..టెన్షన్..

దివాన్‌చెరువు సమీపంలో జీరో జంక్షన్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తే ఆందోళన కలగక మానదు. విజయవాడ నుంచి దివాన్‌చెరువు వైపు గామన్‌వంతెన మీదుగా ప్రయాణించే వాహనాలన్నీ ఈ జీరో జంక్షన్ వద్ద మలుపు తిరుగుతాయి. అలాగే రాజమహేంద్రవరం వైపు నుంచి దివాన్‌చెరువు వైపునకు వచ్చే అన్ని వాహనాలు ఈ జీరో జంక్షన్ వద్ద గామన్ వంతెన మీదుగా వచ్చే వాహనాలతో కలుస్తాయి. దీంతో ఇక్కడ ప్రమాదకరంగా ఉంది.ఏ క్షణం ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.

### కానరాని సర్వీస్ రోడ్లు..

జిల్లా కేంద్రం రాజమహేంద్రవరాన్ని ఆనుకునే దివాన్‌చెరువు జంక్షన్ ఉంటుంది.దివాన్ చెరువు జీవో జంక్షన్ నుంచి రాజానగరం వరకూ సుమారు 5 కిలోమీటర్లు జాతీయ రహదారిపై ప్రయాణంపై ప్రమాదకరంగా ఉంటుంది. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది..ఎవరో ఒకరి ప్రాణాలు గాలిలో కలిసి పోతూనే ఉంటాయి..ఈ రహదారిలో సర్వీస్ రోడ్లు లేకపోవడమే ప్రమాదాలకు కారణంగా వాహనదారులు చెబుతున్నారు. సర్వీస్ రోడ్డుకు అటూ ఇటూ స్థలం ఉన్నా ఆ దిశగా ఆలోచించే వారే కరువయ్యారు.దీంతో ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్ దివాన్‌చెరువు జాతీయ రహదారి మారింది.


అటూ..ఇటూ : దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద అయోమయం

### రోడ్డు పక్కనే పార్కింగ్..

దివాన్‌చెరువు మార్కెట్ నిత్యం రద్దీగానే ఉంటుంది.జాతీయ రహదారిని ఆనుకుని అటూ ఇటూ 200 పైబడి షాపులు ఉంటాయి. ఆయా షాపుల వద్దకు వచ్చిన జనం జాతీయ రహదారి పక్కనే వాహనాలు పార్కింగ్ చేసి వదిలేస్తారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు పక్కకు తప్పుకుందామన్నా దారుండదు. జాతీయ రహదారిపై వచ్చే వాహనాలు ఢీకొని ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. సోమవారం తోడికోడళ్ల మృతి సంఘటన కూడా అటువంటిదే.. బైక్‌పై ముగ్గురు వెళుతుంటే వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో తోడికోడళ్లు అక్కడికక్కడే మృతిచెందారు. అదే సర్వీస్ రోడ్డు ఉండి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఈ రహదారిలో ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాల సంఖ్య తక్కువేం కాదు. అయినా పోలీసుల చర్యలు మాత్రం శూన్యం.


ఇలాగైతే జరగవా ప్రమాదాలు : పండ్ల మార్కెట్ వద్ద రోడ్డు పక్కగానే వాహనాల పార్కింగ్

### ఫ్లయ్ ఓవర్ మాటేది..

దివాన్‌చెరువు జంక్షన్‌లో ఫ్లయ్ ఓవర్ వేస్తామని గతంలో హామీ ఉంది. అది అమలుకు నోచు కోలేదు. దాదాపు పదేళ్ల కిందట ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాడు రోడ్డు పక్కనే ఉన్న భవన యజమానులు కొందరికి పరిహారం ఇచ్చేసి మార్కింగ్ కూడా చేసేశారు. అయితే నేటికీ కదలిక లేదు.. ఫ్లయ్ ఓవర్ నిర్మాణం టెండర్ల దశలో ఆగిపోయినట్టు సమాచారం. ఈ జంక్షన్‌లో గతంలో ఎంపీ పురందేశ్వరి కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితురాలికి సపర్యలు చేసి ఫ్లయ్ ఓవర్ నిర్మాణంపై దృష్టి పెడతామని అన్నారు. అయితే నేటికీ కదలిక లేకపోవడం గమనార్హం.

## ఉల్లాసంగా... ఉత్సాహంగా

● కాకినాడలో కొనసాగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



కాకినాడ క్రీడా మైదానంలో తలపడుతున్న ఆంధ్రా, గోవా జట్ల క్రీడాకారులు



పోటీల్లో విజేతగా నిలిచిన ఆంధ్రా జట్టు



కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ పట్టణంలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ పోటీలు నాల్గో రోజైన మంగళవారం ఉల్లాసంగా ఉత్సాహభరితంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లతో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ పోటీలకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్, వెటరన్ వాలీబాల్ క్రీడాకారుడు సూర్యనారాయణరాజు, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు లంక జార్జ్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ పట్టాభిరామ్, సీనియర్ హాకీ కోచ్ మురళీధర్, డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు, తదితరులు హాజరయ్యారు. ఇందులో ఒడిశా సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్రటేరియట్ 16-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, తెలంగాణ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 18-0 తేడాతో విన్ అయ్యింది. బీహార్ సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్ సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. అలాగే గుజరాత్ సెక్రటేరి యట్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ సెక్రటేరియట్ జట్టు 11-2 తేడాతో గెలిచింది. పాండిచ్చేరి సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్టు 6-4 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్పీబీ సిమ్లా, ఆర్ఎస్పీబీ జైపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్పీబీ జైపూర్ 9-2 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్పీబీ ముంబై, ఆర్ఎస్పీబీ చెన్నై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్పీబీ ముంబై 5-1 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, గోవా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 23-0 తేడాతో విజయం సాధించింది. విజేత జట్లను ప్రకటించారు.

### ● పర్యాటక ప్రాంతాలను సందర్శించిన క్రీడాకారులు

దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు కాకినాడ జిల్లాలో పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. కోరంగి మడఅడవులు, వాకలపూడి బీచ్. శిల్పారామం, అన్నవరం సత్యదేవుని ఆలయం, యానాం, ఉప్పాడ, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామల్లో శివాలయాలను సందర్శిస్తున్నారు.



హాకీ ఆడుతున్న మహిళా క్రీడాకారులు

## క్రీడలపై ఆసక్తితోనే సహాయం చేస్తున్నా

● ఎంవీఎస్ సత్యనారాయణరాజు, వ్యాపారవేత్త



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. వాలీబాల్ ఆడుతుండేవాడిని. హాకీ కోచ్ రవిరాజా, కాకినాడ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్రప్రసాద్ పరిచయంతో హాకీపై మక్కువ ఏర్పడింది. అందుకే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి కావాల్సిన క్రీడా పరికరాలు అందిస్తూ ప్రోత్సహిస్తుంటాను. అలాగే హాకీ క్రీడాకారులకు కూడా సహాయ సహకారాలు అందిస్తుం టాను. స్పోర్ట్స్ ద్వారానే స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. ఇదే స్ఫూర్తితో జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి స్పాన్సర్‌గా వ్యవహరించడమే కాకుండా, ఈ నెల 21న క్రీడాకారులకు మంచి క్యాంప్ ఫైర్ ఏర్పాటు చేయడంతో పాటు బడాఖానా ఏర్పాటు చేస్తున్నాం.



కాకినాడ జిల్లా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ శ్రీధర్



పాయింట్ల కోసం ఉత్సాహంగా ఆడుతున్న దృశ్యం

## అప్పట్లో ఇన్ని సౌకర్యాలు ఉండేవి కాదు

● కేఎల్ నాగమణి, ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్, ఏపీ ఉమెన్ టీం కెప్టెన్



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేము ఆడే రోజుల్లో ఇన్ని సౌకర్యాలు ఉండేవి కాదు. అయినా క్రీడలపై మక్కువతో ఎంతో ఇష్టంగా నేర్చుకునే వాళ్లం. ఆడడానికి హాకీస్టిక్స్, కాళ్లకు షూస్ గానీ ఉండేవి కావు. అప్పుడు నేడు పడ్డ కష్టానికి ఫలితమే హాకీ క్రీడకు చేసిన సర్వీస్‌కి గుర్తింపుగా 2019లో అప్పటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకోగలిగాను. ఇప్పుడైతే హాకీ క్రీడాకారుల కోసం కాకినాడలో కోట్లు ఖర్చుపెట్టి ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్ ఏర్పాటు చేయడంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కి క్రీడల పట్ల ఆయనకు ఉన్న ఇష్టం తెలుస్తుంది. దీనికి గాను హాకీ కోచ్ రవిరాజు కృషి ఎంతో ఉంది. అందుకు తగ్గ ఫలితమే ఆలిండియా సివిల్ సర్వీసెస్ వంటి గొప్ప టోర్నమెంట్‌కి కాకినాడ వేదికగా నిలిచింది.

# శివయ్యా.. దారి చూపయ్యా!?




- కుంభమేళాకు వెళ్లేదారిలేక ఇక్కట్లు
- నేరుగా ఒకటే రైలు..విపరీతమైన రద్దీ
- వేలాది మంది భక్తుల్లో అసంతృప్తి
- ప్రత్యేక బస్సుల్లో నిండుతున్న సీట్లు
- ఇప్పుడైనా రైళ్లు వేయాలని వినతులు
- 26తో మహా కుంభమేళా ముగింపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కుంభమేళాకు వెళ్లాలంటే ఈ ప్రాంతవాసులు రైలు రిజర్వేషన్లతో కుస్తీ పట్లు పట్టాల్సి వస్తోంది. చాంతాడంత వెయిటింగ్ లిస్టులు చూస్తుంటే శివ.. శివా అని ఆశువుగా నోటి నుంచి వచ్చేస్తోంది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది. అయితే ఆ మేరకు రైళ్లు మాత్రం లేవు. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉన్న పురందేశ్వరి రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కుంభమేళా రైళ్లు నడపడంలో మాత్రం ఈ ప్రాంతానికి ఆ మేరకు ప్రాధాన్యం దక్కలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్‌కి వందల రైళ్లు నడుపుతున్నామంటూ దక్షిణ మధ్య రైల్వే ఎంతో గర్వంగా చెబుతున్నా కాకినాడ నుంచి మాత్రం ఒకే ఒక్క వారాంతపు రైలు వేశారు. అటు విజయవాడ, ఇటు విశాఖ నుంచి రైళ్లు వేసినా పుష్కర ప్రాముఖ్యం ఉన్న రాజమహేంద్రవరం ప్రాంతంపై ఎందుకనో చిన్న చూపు చూశారు. మరో వైపు ప్రత్యేక బస్సులు వేస్తున్నా తక్కువ సమయంలో సీట్లు నిండుకుంటు న్నాయి. మహాశివరాత్రి పర్వదినమైన ఈ నెల 26వ తేదీతో మహా కుంభమేళా ముగుస్తున్నా రైళ్ల సంఖ్యలో మాత్రం పెరుగుదల లేకపోవడంపై జనం విస్తుపోతున్నారు. కనీసం ఇప్పుడైనా రెండు మూడు ప్రత్యేక రైళ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.

### శివా.. ఎలా వచ్చేది!




రాజమండ్రి నాలుగు జిల్లాలకు ప్రధాన రైల్వే స్టేషన్. అటు కోనసీమ, ఇటు తీరప్రాంతం కాకినాడ, ఓ వైపు తూర్పు మన్యం, మరోవైపు ఆధ్యాత్మిక ధామం రాజమహేంద్రవరం. ప్రతిరోజూ సుమారు ఈ రైల్వే స్టేషన్ నుంచి 35 వేల మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఇక్కడి నుంచి కుంభమేళాకు ఒకటే ప్రత్యేక రైలు వేశారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు తదితర ప్రాంతాల నుంచి కేవ లం 15 వరకూ బస్సులను నడపగలిగారు. బస్సులో వెళ్లడం అందరికీ సాధ్యపడదు. టికెట్ ధర రూ.13 వేల వరకూ ఉండగా.. దాదాపు 13 పుణ్యక్షేత్రాలు చూపిస్తున్నారు. బస్సు జర్నీ మొత్తం 11 రోజుల పడుతోంది. దీంతో వద్దులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వెనకడుగు వేయక తప్పదు.రైలులో అయితే 20-24 గం టల్లో ప్రయాగ్ రాజ్ చేరుకోవచ్చు.ఇప్పటికైనా 26 వరకూ రిజర్వేషన్,జనసాధారణ్ రైళ్లను నడపాలనే డిమాండ్ వినవస్తోంది.

### నేరుగా ఒకటే రైలు

రాజమండ్రి గుండా వెళ్లేలా కాకినాడ నుంచి ఒకే ఒక ప్రత్యేక రైలును నడుపుతున్నారు. అది కూడా గురువారం మాత్రమే. ఇది పూర్తిగా ఏసీ రైలు కావడంతో టికెట్ ధర రూ.2180 చెల్లించాలి. ఇది సాధారణ భక్తులకు భారమే అయిన ప్పటికీ ఆ రైలుకు వెయిటింగ్ లిస్ట్ 180కి చేరుకొంది. ఢిల్లీ వెళ్లి అక్కడి నుంచి వెళ్దామని అనుకున్నా రాజమహేంద్రవరం నుంచి రోజూ ఏపీ ఎక్స్‌ప్రెస్ ఒకటే అందుబాటులో ఉంది. దీనికీ వెయిటింగ్ లిస్ట్ 80 దాటింది. వారానికి రెండు సార్లు స్వర్ణ జయంతి నడుస్తోంది. ఇలా బ్రేక్ జర్నీల్లో ఒక రైలుకు రిజర్వేషన్ దొరికితే మరో రైలుకు దొరక్కపోవచ్చు. దీంతో చాలామంది ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నారు. ఇక విజయవాడ నుంచి చూస్తే వారాంతపు రైళ్లయిన చెన్నై-గయ, పాటలీపుత్ర, కన్యాకుమారి-కాశీ(2), కోయంబత్తూరు-ధన్‌బాద్ టికెట్లు లేవు. రోజూ నడిచే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో కూడా సీట్లు ఖాళీ లేవు. విశాఖపట్నం నుంచి సోమవారం, బుధవారం, శనివారం కుంభమేళా స్పెషల్స్ వేసినా వాటికి వెయిటింగ్ లిస్ట్ 200 దాటిపో యింది. విమానం విషయానికొస్తే.. హైదరాబాద్ గుండా ప్రయాగ్ రాజ్ సర్వీసులు ఉన్నాయి. అయితే ధర మాత్రం ఒక్కో వెబ్‌సైటులో ఒక్కోలా ఉంది. ఓ వెబ్‌సై టు రూ.18-23 వేలు చూపిస్తుండగా.. మరో వెబ్‌సైటు లో 23వ తేదీకి ఏకంగా రూ.43 వేల టికెట్ ధర ఉంది. ఏదేమైనా విమానంలో ఇక్కడి నుంచి దంపతులు ప్రయాగ్‌రాజ్ వెళ్లి రావాలంటే లక్షణంగా రూ.లక్ష వరకూ ఖర్చవుతోంది. అటు బస్సుల్లో వెళ్లలేక, ఇటు రైళ్లలో ఖాళీ లేక, మరో వైపు విమానానికి డబ్బులు పెట్టలేక కుంభమేళాకు వెళ్లే దారి చూపాలని శివుడిని వేడుకొంటున్నారు.

## నన్నయ యూనివర్శిటీ వీసీగా ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతరించి పోతున్న గిరిజన భాషలను కాపాడుకునేందుకు విశేష కృషి చేసి 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళామూర్తిగా ప్రసన్న నిలిచారు. 20 22లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు. 38 సంవత్సరాల బోధనా అనుభవంలో ఎన్నో భాషా, సాహిత్య సంస్కరణలకు కృషిచేసారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సెమినార్లు నిర్వహించారు. అనేక పరిశోధనా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు అందుకున్నారు. నిత్యం భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రసన్నశ్రీ ప్రస్తుతం నన్నయ విశ్వవిద్యాలయం వీసీగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా ఆచార్య వై.శ్రీనివాసరావు ఏడు నెలలుగా కొనసాగుతున్నారు. ఆయన నన్నయ విశ్వవిద్యాలయంలో భూగర్భశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తూ గత ఏడాది జూలై 18న నన్నయ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతలు చేపట్టారు.

## జేఎన్టీయూకే వీసీగా ప్రసాద్

వర్శిటీ 6వ వీసీగా బాధ్యతలు చేపట్టనున్న ప్రొఫెసర్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే నూతన ఉపకులపతిగా ప్రొ ఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్, వర్శిటీ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ ప్రసాద్‌ను వీసీగా నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేసినట్టు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. ప్రసాద్ ప్ర స్తుతం తెలంగాణలోని వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో సివిల్ ఇంజనీరింగ్, ఎంటెక్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మూడేళ్ల పాటు జేఎన్టీయూకే ఉపకులపతిగా కొనసాగుతారు. గుంటూరు జిల్లాకు చెందిన సీఎస్ ఆర్కే ప్రసాద్ తల్లిదండ్రులు సాంబశివరావు, వెంకట సుబ్బమ్మ. ఆయన గుంటూరు జిల్లా అమర్తలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, తెనాలిలోని వీఎస్ఆర్, ఎన్వీఆర్ కళాశాల్లో ఇంటర్ ఎంపీసీ, వరంగల్‌లోని రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల(ప్రస్తుత ఎన్ఐటీ వరంగల్)లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రసాద్ పర్యవేక్షణలో ఇప్పటివరకూ 8మంది పీహెచ్‌డీ పూర్తిచేయగా ఐదుగురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. 2008లో జేఎన్టీయూకే విశ్వవిద్యాలయం ఏర్పాటు కాగా మొదటి ఉపకులపతిగా ప్రొఫెసర్ అల్లం అప్పారావు, రెండో వీసీగా జి.తులసీ రామ్‌దాస్, మూడో వీసీగా వీఎస్ఎస్ కుమార్, నాలుగో వీసీగా ప్రొఫెసర్ ఎం.రామలింగరాజు, 5వ వీసీగా ప్రొఫెసర్ జీవీ ఆర్ ప్రసాదరాజు వి. ధులు నిర్వర్తించగా 6వ వీసీగా ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

## బాలబాలాజీ హుండీల ఆదాయం రూ.43.30 లక్షలు



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులోని అప్పనపల్లి బాలబాలాజీ హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్ష ణలో మంగళవారం తెరిచి లెక్కిం చారు. 68 రోజులకు ప్రధాన హుం డీల ద్వారా రూ.43,30,182 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 13గ్రాముల బంగారం, 131 గ్రాముల వెండి లభించిందన్నారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, బ్యాంక్ ఆఫ్ బరోడా అప్పనపల్లి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లూరి మన్యంలో 'ఆర్గానిక్ సెజ్'

- సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నాం
- పోలవరం పునరావాసమూ ప్రాధాన్యాతాంశమే
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



రంపచోడవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి మన్యం జిల్లాలో ఆర్గానిక్ వ్యవసాయ, ఉద్యానవన తదితర అంశాల ప్రాధాన్యంగా స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్ఈజెడ్) ఏర్పాటు దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అన్ని అంశాల్లో గిరిజనుల భాగస్వామ్యం ఉండా లన్న ప్రభుత్వ నిర్దేశాన్ని అమలు చేసే చర్యలు చేపడుతున్నామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రంప చోడవరం పర్యటనకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన వన రంగాల వృద్ధి ద్వారా గిరిజన జీవన ప్రమాణాలను పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అరకు కాఫీ, రంప రబ్బరు, అనేక కలపేతర అటవీ ఉత్పత్తులు కొన్ని దశాబ్దాలుగా గిరిజనుల ద్వారా వచ్చి అనేక చేతులు మారి మైదాన ప్రాంతాలకు, ఇతర దేశాలకు కూడా దళారుల ద్వారా ఎగుమతి అవుతు న్నాయన్నారు. ఆయా ఉత్పత్తుల విలువ హెచ్చింపు చర్యలను గిరిజనులతోనే అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులతో చేపట్టి తద్వారా వాటికి మంచి గిట్టుబాటు రప్పించే దిశగా చర్యలు చేపడుతు న్నామన్నారు. ఇందులో భాగమే ఆర్గానిక్ సెజ్ అన్నారు. ఈ ఎస్ఈజడ్ పూర్తిగా గిరిజనుల భాగస్వామ్యంతో, గిరిజన సంక్షేమ అనుబంధ వ్యవస్థల సహాయంతో ఏర్పాటవుతుం దన్నారు. తద్వారా ఇక్కడి ఉత్పత్తులకు ప్రత్యేక విలువ కలిగి అంతర్జాతీయ మార్కెట్లో కూడా స్థానం దక్కుతుందన్నారు.

### విజన్ డాక్యుమెంట్ల రూపకల్పన

రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏల ద్వారా గిరిజనాభివృద్ధికి విజన్ డాక్యు మెంట్లను రూపొందిస్తామన్నారు. మన్యంలో అధికారులు గిరిజన హక్కులను పరిరక్షించాలన్నారు. గిరిజనుల హక్కులు, గిరిజన ప్రాంత వనరుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తో ఉందన్నారు. గిరిజనుల హక్కు లకు ఎక్కడ భంగం కలిగినా ఉపేక్షిం చేది లేదని, గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమ లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఉన్న వ్యవస్థలను మరింత పటిష్ఠపరుస్తున్నామన్నారు. గిరిజన చట్ట ఉల్లంఘనలపై నమోదై పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలన్న లక్ష్యాలను ఆయా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులకు, అదనపు ఏజెంటు కోర్టులకు నిర్దేశించామని చెప్పారు.


### 'జన్‌మన్' ఇళ్ల పూర్తికి చర్యలు

అల్లూరి జిల్లాలో ఆదిమ జాతి గిరిజనులు (పీవీటీజీ) కోసం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిధులతో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద 25,578 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. అదనంగా 576 రహదారులు, 1660 మంచినీటి పథకాలు మంజూరయ్యాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస చర్యలను వేగవంతం చేస్తున్నామన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## డెల్టా కాలువలకు 8600 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 8600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4300 క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదల అవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 8600 క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.60అడుగులుగా నమోదయింది.



# అప్పుడే ఎండ తీవ్రత!

అప్పు'డే' ఎండల తీవ్రత పెరిగింది. ఫిబ్రవరిలోనే వేడిమి వాతావరణం మొదలైంది. మంచు, చలి ఉధృతంగా ఉండాల్సిన సమయంలో ఉదయం నుంచే ఎండ మండుతోంది. నాలుగైదు రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అంతకుమించి నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉందన్న స్థాయిలో ఎండ తీవ్రత ఉంది.

- ఫిబ్రవరిలోనే మొదలైన వేడి వాతావరణం
- శివరాత్రి రాకుండానే ఉక్కపోత ప్రారంభం
- అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 11గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లా అంతటా వేడి వాతావరణమే కనిపిస్తోంది. రాత్రికి ఉక్కపోత కూడా పెరిగింది. సాధారణంగా ఈ సమయంలో జిల్లాలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. పగటిపూట కూడా చలి వాతావరణమే ఉంటుంది. అర్ధరాత్రి నుంచి చలితో కూడిన మంచుపడుతూ ఉదయం 9గంటల వరకు ఆ ప్రభావం ఉంటుంది. అనంతరం కూడా ఎండ పెద్దగా ఉండదు. శివరాత్రి పండుగ వరకు ఈ తరహా వాతావరణం కొనసాగుతుంది. అనంతరం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. ఈ ఏడాది అందుకు భిన్నంగా కనిపిస్తోంది. శివరాత్రి ఇంకా8రోజులు ఉండగా అప్పుడే ఎండల తీవ్రత పెరిగింది.

### ఈ వేసవిలో ఎండలు అధికమే..

ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ సంకేతాలు ఇస్తుండగా ఆ ప్రభావం ఇప్పటినుంచే కనిపిస్తోంది. జిల్లాలోని అత్యధికప్రాంతాల్లో నాలుగైదురోజులుగా మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. కాకినాడలో మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా ఉంది. ఇక్కడ ఈనెల 1న 31.7 డిగ్రీలు, 2న 32.7 డిగ్రీలు, 3న 34.3 డిగ్రీలు నమోదైంది. గత నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రత పెరిగింది. ఈ సమయంలో ఇలాంటి వాతావరణం ఉండడంతో వేసవిలో ఏస్థాయిలో ఎండలు ఉంటాయోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతుంది.

## ఉపాధి నిమిత్తం వెళ్లి..
# కువైట్‌లో మృతి



తారక ముత్యాలరాము (ఫైల్)



ఆవేదన వ్యక్తం చేస్తున్న రాము కుటుంబ సభ్యులు

- ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపిన తోటి డ్రైవర్
- మృతుడిది కోనసీమ జిల్లా మొగలికుదురు
- వేధింపులు తాళలేకే బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని కుటుంబసభ్యుల ఆరోపణ

మామిడికుదురు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పరాయి దేశానికి వెళ్లిన ఆ యువకుడు అర్ధంతరంగా తనువు చాలించాడు. కారణం ఏంటనేది స్పష్టంగా తెలియనప్పటికీ ఉద్యోగంకోసం వెళ్లిన కుమారుడు అకస్మాత్తుగా మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

### వేధింపులు భరించలేకపోతున్నానని ఫోన్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురుకు చెందిన నేదూరి రామలక్ష్మి-సురేష్ దంపతుల కుమారుడు నేదూరి తారక ముత్యాలరాము(24) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లాలనుకుని కొమరాడకు చెందిన వలవల నాగరాజును సంప్రదించాడు. వీసా నిమిత్తం అతడికి రూ.85వేలు కూడా ఇచ్చాడు. గతేడాది డిసెంబరు 28న బయలుదేరి జనవరి 1న కువైట్‌లో అడుగుపెట్టాడు. అప్పటినుంచి నాగరాజు వేధింపులు భరించలేకపోతున్నానని రాము పలుమార్లు తమకు ఫోన్‌లో చెప్పేవాడని, కొన్నిరోజులు పోతే వేధింపులు తగ్గుతాయని తమ కుమారుడికి నచ్చచెప్పినట్టు తల్లిదండ్రులు తెలిపారు. తమ యజమాని మంచివాడే కానీ తన సాటి డ్రైవర్‌గా చేస్తూ తనతోపాటే రూములో ఉండే నాగరాజు మాత్రం తనను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడని పలుమార్లు తమ దృష్టికి తెచ్చాడని వారు వాపోయారు. ఈనెల 13న గురువారం సాయంత్రం రాము కనిపించడం లేదని, ఎక్కడికో పారిపోయాడని కువైట్‌లోనే ఉంటున్న తమ బంధువులకు నాగరాజు ఫోన్ చేసి చెప్పాడన్నారు. అదేరోజు సాయంత్రం స్థానికంగా ఉన్న బీచ్ వద్ద పాడుపడిన బంగ్లాలో రాము ఉరివేసుకున్నాడని సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో తమ బంధువులు కూడా సంఘటనా స్థలానికి వెళ్లి చూశారన్నారు. దీంతో వారు ఇండియన్ ఎంబసీ అధికారులు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతో ఈనెల 17వతేదీ సోమవారం మృతదేహం స్వగ్రామం వచ్చిందని రాము తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడని కాదని, వీసా తీసిన వ్యక్తి వేధింపులకు పాల్పడడంవల్ల మరణించాడా లేక మరేమైనా జరిగిందా అన్న అనుమానంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఈనెల 14న నగరం పోలీస్‌స్టేషన్‌లో, తహశీల్దార్ కార్యాలయంలోను, 15న కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని మృతుడి తల్లిదండ్రులతోపాటు సోదరుడు ఫణీంద్రకుమార్ తెలిపారు.

## దొంగసాధువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పెద్దాపురం పోలీసుల హెచ్చరిక



సీసీ ఫుటేజీలో దొంగ సాధువు

పెద్దాపురం(సామర్లకోట), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దొంగ సాధువులపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో రెండురోజులుగా సాధువునని నమ్మించి ఓవ్యక్తి స్థానిక దుకాణాలవద్ద ఆశీర్వాదాలు అందిస్తున్నట్లు నటించి వారి నుంచి సొమ్ములను తీసుకుని పరారీ అవుతున్నట్లు పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఇటువంటి దొంగ సాధువులెవరైనా షాపులవద్దకు వస్తే తక్షణం తమకు సమాచారమివ్వాలని పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

# బాలిక అనుమానాస్పద మృతి



మృతదేహం వద్ద రోధిస్తున్న బాలిక కుటుంబసభ్యులు

- ఆమెను పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు
- అతడి వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుందని స్థానికులు, బాలిక కుటుంబీకుల ఆరోపణ
- గతంలోనూ అతడిపై కేసు

సామర్లకోట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం మాధవపట్నంలో బాలిక అనుమానాస్పదస్థితిలో సోమవారంరాత్రి మృతి చెందగా ఈ సంఘటనలో అనుమానితుడిగా ఉన్న వ్యక్తిని సామర్లకోట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

సామర్లకోట మండలం మాధవపట్నంలో 17 ఏళ్ల దళిత బాలికను అదే గ్రామానికి చెందిన అనుసూరి విఘ్నేశ్ గతంలో ప్రేమ పేరిట వేధించేవాడు. దీంతో 2023లో బాలిక ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిపై అప్పట్లో ఎస్సీ,ఎస్టీ, పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన విఘ్నేశ్ ఆ బాలిక వద్దకు వెళ్లి తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమెకు మాయమాటలు చెప్పి వివాహం కూడా చేసుకున్నాడు. కొంతకాలం అదే గ్రామంలో బాలికతో కాపురం పెట్టాడు. ఇటీవలకాలంలో ఆమెపై వేధింపులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో రెండురోజులుగా వారిద్దరి మధ్య ఘర్షణలకు జరుగుతున్నాయని, ఆమె శారీరకంగా వేధించాడని స్థానికులు తెలిపారు. ఈ బాధలు భరించలేక సోమవారం రాత్రి ఆమె అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉండడాన్ని చుట్టుపక్కల ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలికను విఘ్నేశ్ తీవ్రంగా కొట్టడంవల్లే ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ మేరకు సామర్లకోట పోలీసులు కేసును వేగవంతంగా దర్యాప్తు నిర్వహించారు. ప్రాథమిక విచారణ మేరకు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేశారు. అతడిని కఠినంగా శిక్షించాలని బాలిక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

# సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు





జడ్పీ సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యులు, మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా శాఖాపరమైన సమీక్షల్లేవు..
- తీర్మానాలు లేవు
- కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్.. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనల ప్రకారం సమావేశాలు నిర్వహించాల్సిన తీరు.. దీనికితోడు మెజారిటీ సభ్యులు నిర్ణీత సమయానికి రాకపోవడంతో కోరం లేక జడ్పీస్థాయీ సంఘ సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభించారు. అది కూడా ఏ విధమైన శాఖాపర సమీక్షలు చేయకుండా, తీర్మానాలు ఆమోదించకుండా సమావేశాలు సాదాసీదాగా ముగించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు మంగళవారం కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలు, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం, వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన 6వ స్థాయి సంఘ సమావేశం, స్థాయి సంఘ చైర్ పర్సన్ రొంగల పద్మావతి అధ్యక్షతన 5వ స్థాయి సంఘ సమావేశం జరిగాయి. ఈ సమావేశాల్లో జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, జడ్పీటీసీ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, జడ్పీ పరిపాలనాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 'నిర్లక్ష్యం'పై వేటు!

- రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు
- నలుగురు డాక్టర్లు, ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు
- నిన్న మంత్రి సుభాష్ పర్యటన.. నేడు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఉత్తర్వులు



ఈఎస్‌ఐ ఆస్పత్రిలో సోమవారం హాజరుపట్టీ పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు డాక్టర్లు, ఐదుగురు కార్యాలయ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విజయవాడలోని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సుభాష్ ఆదేశించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ తక్షణమే స్పందించి మంగళవారం ఈచర్యలు తీసుకున్నారు.

రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆసుపత్రిని సోమవారం మంత్రి సుభాష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సమయంలో కొందరు వైద్యులు, కార్యాలయ సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. హాజరుపట్టీని ఆయన పరిశీలించారు. కొందరు డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది హాజరు నమోదు చేసుకుని విధులు నిర్వర్తించకుండా ఆస్పత్రినుంచి వెళ్లిపోతున్నట్టు గుర్తించారు. అక్కడున్న మరికొందరు సరైన సమాధానం, సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి సుభాష్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్‌ను ఆదేశించారు. దీంతో విధినిర్వహణలో బాధ్యతారాహిత్యంగావ్యవహరించిన డాక్టర్లు, సిబ్బందిపై వేటు పడింది. కాగా, దీనిపై విచారణ కొనసాగుతోందని, నివేదిక ఆధారంగా మరిన్నిచర్యలు తీసుకుంటామని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఈఎస్‌ఐబీమా చందాదారులు, వారి కుటుంబీకులకు నాణ్యమైన వైద్యసేవలందజేసేందుకు కట్టుబడి ఉందని, రోగుల విషయంలో నిర్లక్ష్యం, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

# అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం




చింతూరు నుంచి డొంకరాయికి ఆటోలో తరలిస్తున్న మద్యం

చింతూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు నుంచి ఆటోలో డొంకరాయి బెల్టుషాపునకు అక్రమంగా తరలించబోయిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి చింతూరులోని షాపులకు మంగళవారం ఒక వ్యాన్‌లో మద్యం దిగుమతి అయింది. కాగా అదే వ్యాన్‌లో వై.రామవరం మండలం చవిటిదిబ్బలు వైన్‌షాప్ పేరిట 13 బీర్ కేసులు(156 బీర్లు), 11 కేసుల క్వార్టర్ బాటిళ్లు(528 బాటిల్సు) కూడా తరలించారు. ముందుగా అనుకున్న ప్రణాళిక మేరకు ఇక్కడినుంచి వై.రామవరం మండలం డొంకరాయిలోని ఒక బెల్టు షాప్‌నకు ఈ బాటిళ్లను తరలించేందుకు ఆటోలో లోడు చేశారు. విషయం పసిగట్టిన కొంతమంది వ్యక్తులు చింతూరులోని ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఎక్సైజ్ అధికారులు వ్యాన్, ఆటోల వద్దకు చేరుకుని అక్రమంగా తరలించబోతున్న మద్యం బాటిళ్లు, ఆటోని సీజ్ చేయడంతోపాటు ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎక్సైజ్ ఎస్‌ఐ (చింతూరు) వై.వీరవెంకటసత్యలక్ష్మణస్వామిని సంప్రదించగా అక్రమ తరలింపునకు సిద్ధం చేసిన మద్యం సహా ఆటోను సీజ్ చేశామని, ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.లక్షా12వేల వరకు ఉంటుందన్నారు.

# 'పాదగయ'లో మహాశివరాత్రి ఉత్సవాలకు అదనపు సిబ్బంది

- సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత
- దేవదాయశాఖ ఆర్‌జేసీ సుబ్బారావు



పిఠాపురం పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు

పిఠాపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో జరిగే కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు తెలిపారు. ఉత్సవాలకుగాను వివిధ ఆలయాలనుంచి అదనపు సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఆయన మంగళవారం సందర్శించుకున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. సామాన్య భక్తులకు దర్శనాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దర్శనాల సమయంలో భక్తులను ఆపడం, ఆటంకాలు కల్పించడం చేయవద్దని అర్చకులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాదగయ పుష్కరిణి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. స్నానాలు ఆచరించిన తర్వాత భక్తులు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. పిండ ప్రదానాలు, మూసివాయనాల కోసం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం తోపాటు వచ్చిన వారు త్వరగా కార్యక్రమాలు పూర్తి చేసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయం ఆవరణ, బయట పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. దేవాదాయశాఖ కమిషనరు ఆదేశాల మేరకు చీఫ్‌ఫెస్టివల్ ఆఫీసర్‌గా అన్నవరం దేవస్థానం ఏఈవోను నియమించినట్లు తెలిపారు. ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా దేవదాయశాఖ అధికారి దుర్గాభవానీ, పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### సామర్లకోటలో పరిశీలన



సామర్లకోట భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్‌జేసీ

సామర్లకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి స్థానిక అధికారులకు తగు సూచనలు చేశారు. సామర్లకోటలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయనున్నందున వారికి ఆలయ ఆవరణలో అన్ని రకాల సదుపాయాలు కలుగజేయాని సూచించారు. వీఐపీల దర్శనాలతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సామర్లకోట ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, దేవదాయ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఉప్పుటేరులోకి దూకి యువతి ఆత్మహత్య



అరుణ(ఫైల్ ఫోటో)

కాకినాడ క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఉప్పుటేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడలోని సూర్యనారాయణపురానికి చెందిన అనపాల అరుణ(24) స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్లో హౌస్ కీపర్‌గా పనిచేస్తోంది. కాగా ఆమె బయట అప్పులు అధికంగా చేస్తుండడంతో ఈనెల 16న తల్లిదండ్రులు మందలించారు. దీంతో అరుణ అదేరోజు రాత్రి 10.30గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబీకులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో అరుణ కుటుంబీకులు స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఉమెన్ మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అరుణ మృతదేహం స్థానిక జగన్నాథపురం ఉప్పుటేరులో తేలినట్లు మంగళవారం పోలీసులు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:297808

4 Lines CLASSIFIED Rs.230/- Only

## భారీ వాహనంతో నిలిచిన ట్రాఫిక్




రావులపాలెం హైవేపై వెళ్తున్న భారీ వాహనం

రావులపాలెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గోపాలపురం రావులపాలెం జాతీయరహదారిపై భారీ వాహనం కారణంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇదే తరహా మరో మూడు వాహనాలు కూడా జాతీయ రహదారి వెడల్పున సరిపడగా ఒకేసారి ప్రయాణించడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఈతకోట టోల్‌గేట్‌వద్ద గౌతమి వంతెన మీద వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## చెందుర్తిలో మరో 1500 కోళ్లు మృతి

### ఖననం చేసిన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు




కోళ్లు ఖననం చేసిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తిలో పుష్కర-పోలవరం కాలువ గట్టుపై ఉన్న కోళ్ల ఫారంలో మరో 1500 కోళ్లు మంగళవారం మృత్యువాత పడ్డాయి. ఇప్పటివరకూ ఈ ఒక్కఫారంలోనే 6వేల కోళ్లు చనిపోయాయి. చనిపోయిన కోళ్లను జనావాసాలకు దూరంగా గోతులు తీసి ఖననం చేశారు. బర్డ్‌ఫ్లూ అనుమానిత కోళ్లు ఖననం చేసిన ప్రదేశం కాబట్టి ఇక్కడ ప్రజలు, వాహన రాకపోకలు నిషిద్ధమంటూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

## స్టాక్ మార్కెట్ పేరుతో టోకరా

### రూ.14.92 లక్షల ఆన్‌లైన్ దోపిడీ

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నారాయణపురానికి చెందిన బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసే బి.శ్రీనివాస్ అనే వ్యక్తి స్టాక్ మార్కెట్ పేరుతో వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి పెట్టుబడి పెట్టి రూ.14.92 లక్షల నగదు పోగొట్టుకున్నాడు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ 2024, డిసెంబరులో తన ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు అవుతుందనే సందేశాన్ని చూసి దఫదఫాలుగా రూ.14లక్షల92వేలు పెట్టుబడి పెట్టారు. దీనికి సంబంధిచి రూ.40లక్షలు నగదు అతడికి రావాల్సిందని మెసేజ్‌లో చూపించింది. తనకు రావాల్సిన డబ్బుల కోసం సదరు ఆన్‌లైన్‌లో ప్రయత్నించగా వారు అకౌంట్ క్లోజ్ చేశారు. దీంతో బాధితుడు మంగళవారం ప్రకాష్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

# టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ వసుంధర**



ల్యాబ్ రిపోర్టులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ వసుంధర తెలిపారు. టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ రహిత గ్రామంగా గుర్తించిన వెంకటనగరంలో డాక్టర్ సురేంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల ల్యాబ్ రిపోర్టులు, పేషెంట్ కార్డులను, పేషెంట్లు మందుల వాడే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చెరుకూరి రాణి, ఎస్‌టీఎస్ సుజనకుమారి, ఎస్‌టీఎల్ఎస్ రత్నకుమారి, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఆదివాసీలపై కూటమికి మహోన్నత ప్రేమ

**ఏఐఎస్‌టీఈఏ జిల్లా అధ్యక్షుడు వరహాలదొర**

దివాన్‌చెరువు, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆదివాసీల పట్ల మహోన్నతమైన ప్రేమ చూపుతోందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం(ఏఐఎస్‌టీఈఏ) జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ వరహాలదొర హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ మహిళను నన్నయ యూనివర్సిటీ ఉపకులపతిగా నియమించడం అభినందనీయమన్నారు. ఆమె ఆదివాసీ తెగలపై, ఆదివాసీ సమాజం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలలు, ఆదివాసీ భాషలపై అనేక రకమైన పరిశోధనలు చేశారన్నారు. ఆదిమ జాతి తెగలలో లిపిలేని, అంతరించిపోతున్న భాషలకు లిపి కనుగొన్న తొలి ఆచార్యులు అని తెలిపారు. అత్యున్నతమైన అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న మొదటి గిరిజన మహిళగా కుడా పేరు సంపాదించుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తొమ్మిది ఉపకులపతుల జాబితాలో గొప్ప మేధావి అయిన ప్రసన్నశ్రీకి అవకాశం ఇవ్వడం హర్షనీయమన్నారు.

# కోటి-కూనవరం సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోటి, కూనవరం మధ్య నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మంగళవారం పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. ఈ సందరర్భంగా అక్కడ రైతులతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల మధ్య ఈ వంతెన నిర్మాణంతో రెండు గ్రామాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పంట పొలాలకు సక్రమంగా సాగునీరందుతుందని, వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది ఉండదన్నారు. వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తియ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# కాలినడకన పట్టిసం వెళ్లే భక్తులకు బాట

**మహాశివరాత్రి ఏర్పాట్లపై ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బీవీఆర్ సమీక్ష**



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్, నీరుకొండ

సీతానగరం, ఫిబ్రవరి 18( ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి పట్టసం వెళ్లే భక్తుల కోసం వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద చేయవలసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నియోకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలుశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నీరు తక్కువగా ఉన్నందున భక్తులు కాలినడకన గోదావరి దాటడానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బలరామకృష్ణ అన్నారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయం, గోదావరి పాయ వద్ద బారికేడ్లు, భక్తులకు మరుగుదొడ్లు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో పెందుర్తి అచ్యుతరామారావు, గద్దే సురేష్, చిట్టూరి రంగారావు, గుర్రం ఉదయభాస్కరరావు, ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు

# కూటమిలో చిచ్చు పెట్టేందుకు వైసీపీ యత్నం

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర**



అనపర్తి, రంగంపేట కార్యవర్గాల సభ్యులతో నాగేంద్ర, నల్లమిల్లి

అనపర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమన్వయంతో పనిచేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య వైసీపీ చిచ్చులు పెట్టే ప్రయత్నాలు చేస్తుందని వీటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన అనపర్తి, రంగంపేట మండలాల బీజేపీ నూతన కార్యవర్గాల ఏర్పాటు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా అనపర్తి కార్యవర్గాన్ని మండలాధ్యక్షుడు కర్రి బులిరెడ్డి, రంగంపేట కార్యవర్గాన్ని మండలాధ్యక్షుడు సాయిరామ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే కూటమి పార్టీల ఐక్యతలో అనపర్తి నియోజకవర్గం మొదటి వరుసలో నిలిచిందన్నారు. రాబోయే రోజుల్లో ఇదే ఐక్యతను కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీల్లో స్థానం పొందిన వారిని నాగేంద్ర, రామకృష్ణారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శివరామకృష్ణంరాజు, గొల్లు హేమతులసి, గిరి డా గంగా భవాని, రజని పాల్గొన్నారు.

# టీబీ ముక్త్ పంచాయతీ క్లెయిమ్స్ వెరిఫికేషన్

**జిల్లాలో 107 పంచాయతీలు క్లెయిమ్స్ సమర్పణ: డీఎంహెచ్‌వో**

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ పంచాయతీ క్లెయిమ్స్‌కు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని రాజవోలు పంచాయతీ, వెంకటనగరం పంచాయతీ క్లెయిమ్స్‌ను జిల్లా అబ్జర్వర్ల బృందం పరిశీలించినట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర ఓ ప్రకటనలో వెల్లడించారు. మంగళవారం వెరిఫికేషన్ ప్రాసెస్ ప్రారంభమైందని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ వసుంధర, జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణి, ప్రభుత్వ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నుంచి డాక్టర్ సురేంద్ర, ఐఎంఏ నుంచి డాక్టర్ గురుప్రసాద్, సభ్యులు వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. ఈ సమయంలో పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, టీబీ సూపర్‌వైజర్, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ పాల్గొనాల్సి ఉంటుంది. కాగా, 2024 సంవత్సరానికి తూర్పుగోదావరి జిల్లా నుంచి 107 పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయతీలకు క్లెయిమ్స్ సమర్పించాయని, వీటిలో 77 సిల్వర్ మెడల్ కోసం, 29 బ్రాంజ్ మెడల్ కోసం పోటీ పడుతున్నాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## అత్తపై హత్యాయత్నం కేసులో జరిమానా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అత్తపై హత్యాయత్నం చేసిన కేసులో అల్లుడికి కోర్టు జరిమానా విధించింది. ప్రకాశంనగర్ సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కొడవలికి చెందిన కొప్పిశెట్టి సత్యనారాయణ స్థానిక నారాయణపురంలో ఉంటున్న తన అత్త ఇంటికి వచ్చాడు. 2023 జనవరి 7న భార్య ఫోనులో మాట్లాడుతుండగా అనుమానంతో గొడవకు దిగాడు. అత్త నురుకుర్తి కాంతమ్మ కల్పించుకోగా ఆమెపై చాకుతో దాడి చేశాడు. నేరం రుజువు కావడంతో కోర్టు రూ.15వేలు జరిమానా విధించిందని సీఐ పేర్కొన్నారు.

## మైన్స్ ఏడీపై కోర్టు ధిక్కారణ కేసు పెడతాం: కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్బారావునగర్, సింహచల్ నగర్, సున్నంబట్టి లేఅవుట్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న క్వారీ గోతులను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేస్తూ బత్తిన సుబ్బారావు సేవాసమితి ఆధ్వర్యంలో మాజీ స్థాయి సంఘం చైర్మన్ బర్రే కొండబాబు మైన్స్ ఏడీ కార్యాలయం వద్దన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ గోతులను పూడ్చాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా మైన్స్ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని, దీనికి సంబంధించి ఏడీపై కోర్టు ధిక్కారణ కేసు పెడతామని కొండబాబు పేర్కొన్నారు.

## రామకృష్ణ పరమహంస జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాచెరువు వద్ద స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో మంగళవారం రామకృష్ణ పరమహంస జయంతి నిర్వహించారు. సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, అనూప్ జైన్.. రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు.

# జీబీఎస్‌తో అప్రమత్తంగా ఉండాలి

» బాధితులకు రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో ఐసోలేషన్ రూమ్
» మందులు, ఇంజక్షన్లు సిద్ధం
» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ప్రభుత్వ బోధనాసుపత్రి సందర్శనలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారో సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి జీబీఎస్‌కు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. ముందస్తు జాగ్రత్తలపై వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీబీఎస్‌తో బాధపడేవారి కోసం రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో ఐసోలేషన్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన మందులు, ఇంజక్షన్లు కూడా సిద్ధంగా ఉంచారని అన్నారు. జీబీఎస్ సోకితే కండరాల బలహీనత, తిమ్మిర్లు రావడం, కాళ్లు చచ్చుబడిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. జీబీఎస్ కాళ్లలో ప్రారంభమై పైవరకూ వ్యాపిస్తుందని, తిమ్మిర్లు, నడవలేని స్థితి సంభవిస్తుందని, అవు వంటి స్థితి కనిపిస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి చికిత్స తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదని ఆయన వెల్లడించారు. సాధారణ జలుబుగా ఈ వ్యాధి ప్రారంభమవుతుందని, అజాగ్రత్తగా ఉంటే ప్రాణాపాయం సంభవిస్తుందని హెచ్చరించారు. ఒక పేషెంట్‌కు ఐదు రోజులపాటు ఇంజక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని, బయట ఈ ఇంజక్షన్ ఖరీదు రూ.20,000 వరకూ ఉంటుందని, ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేస్తారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, మరుకుర్తి రవియాదవ్, ఆసుపత్రి కమిటీ సభ్యులు ఉన్నారు.

# శిక్షణతో విద్యాప్రమాణాలు మెరుగు

**అంగన్‌వాడీ వర్కర్ల శిక్షణ కార్యక్రమంలో ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్**



రాజానగరం శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో రామన్న

రాజానగరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఎదుగుదలకు, విద్యా ప్రమాణాలు మెరుగునకు శిక్షణ దోహదపడుతుందని మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాద్ పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు రాజానగరం జీడీపీ హైస్కూల్లో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీవో టి.నాగమణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామన్నదొర మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ టీచర్లంతా తమ కేంద్రాల్లో సమర్థవంతంగా కొనసాగించాలన్నారు. రీసోర్స్‌పర్సన్లుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గోవిందుకుమారి, సుమలత, రమేష్, జమ వ్యవహరించారు.

**అనపర్తి:** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆరు రోజుపాటు జరగనున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలను స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డితో కలిసి ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, స్టేట్ అబ్జర్వర్ కనకనాయుడు, డీఆర్పీలు సుభద్ర, దాసు రాజు, ఛాయాదేవి పాల్గొన్నారు.

**బిక్కవోలు:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో వి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు నేర్చుకున్న విషయాలను తరగతి గదుల్లో వినియోగించాలన్నారు. ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలందరికీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 120 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణలో అంగన్వాడీకి వచ్చే విద్యార్థులకు మరింత విద్య నేర్పేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. టీఎల్ఎం తయారీపై శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం ప్రభాకరరావు పాల్గొన్నారు. ఊలపల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

# కూటమి అభ్యర్థి విజయానికి కృషి

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



రాజమహేంద్రవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అఖండ విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాజమహేంద్రవరం 41వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి రాజశేఖరం విజ్ఞత కలిగిన ఆలోచనా పరుడని నిరుద్యోగులకు, పట్టభద్రులకు న్యాయం చేస్తారని ఆయనకు విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీ పీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కు మార్, జానకిరామయ్య, దినేష్, బుడ్డిగ రవి పాల్గొన్నారు. అలా గే స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల, విజయదుర్గ కళాశాల, ఏకేసీ కళాశాల, లాలాచెరువు హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కాశి నవీన్‌కుమార్ కలిసి రాజశేఖరంను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తుల కిరణ్ బాబు, చాపల చినరాజు, బత్తుల బాషా, మ దీనా సాహెబ్ పాల్గొన్నారు.

**కోరుకొండ:** మండలంలోని గాడాల, మధురుపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాఠశాలలు, సచివాలయాలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రామ స్థాయిలో పనిచేస్తున్న పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని, రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బిక్కవోలు:** మండలంలోని ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లో కూటమి నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను, సచివాలయ సిబ్బందిని, గ్రామాల్లోని పట్టభద్రులకు కలసి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందల వీరబాబు, రెడ్డి శ్రీనివాసరావు, చవ్వాకుల బాబులు, ముమ్మిడి వీరరాఘవులు, దుళ్ల నాగేశ్వరరావు, బదిరెడ్డి శ్రీను, పందు రకడరాజు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: నియోజకవర్గ పరిశీలకురాలు తేజోవతి, టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, పండూరి అప్పారావు తదితరులు ధవళేశ్వరంలోని కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిన్నంటి ఏకబాబు, యర్రమోతు ధర్మరాజు, ఆళ్ల ఆనందరావు, సావాడ శ్రీనివాసరెడ్డి, బత్తిన బ్రదర్స్, జనసేన నాయకురాలు అమీనా బేగం, బీజేపీ నాయకుడు జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

## గృహ నిర్బంధం అవాస్తవం

**అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ**

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా ఇక్కడ కొంతమందిని గృహ నిర్బంధం చేశామని అవాస్తవాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని.. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీ కృష్ణ పేర్కొన్నారు. ప్రకాశంనగర్ పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని పలు చోట్ల చెక్‌పోస్టులు పెట్టామన్నారు. నిఘా ముమ్మరం చేశామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

గోకవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని డీఎల్‌పీవో ఎం.నాగలత సూచించారు. మండలంలోని అచ్యుతాపురం సచివాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రశాంతి గ్రామాన్ని సందర్శించి ఇంటి పన్ను వసూళ్లపై అధికారులను ఆరా తీసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో సచివాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ఇంటి పన్ను వసూళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా వసూళ్లు జరపాలని, ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని డీఎల్‌పీవో చెప్పారు.

## హైస్కూల్‌కు 'జోస్ ఆలుక్కాస్' ఫర్నీచర్ బహూకరణ



జోస్ ఆలుక్కాస్ ప్రతినిధిని సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాటిలైట్ సిటీ జడ్పీ ఉన్నత పాఠశాలకు జోస్ ఆలుక్కాస్ సౌజన్యంతో సుమారు రూ.4లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను అందజేశారు. కుర్చీలు, బీరువాలు, ఆఫీస్ టేబుల్స్ తదితర ఉపకరణాలను సమకూర్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బత్తిన రాజరాజేశ్వరి అధ్యక్షతన జోస్ ఆలుక్కాస్ ఉప మేనేజరు కార్తీక్, సత్యనారాయణలను డీఈవో కెవాసుదేవరావు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సత్కరించారు.

## చెట్ల కొమ్మల తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెట్టు కొమ్మలను తరలిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

ధవళేశ్వరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను నరికివేసి ఎక్కడవి అక్కడే రోడ్లపైన వదిలివేసిన విద్యుత్ శాఖ సిబ్బంది తీరు, పట్టించుకోని పంచాయతీ అధికారుల తీరుపై నరికేయడం... వదిలేయడం...శీర్షిక ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. పలు ప్రాంతాల్లో నరికివేసిన కొమ్మలను మంగళవారం విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు.

## వంశీని సమర్థించి జగన్ మరో తప్పు చేశారు

**టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ**

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని సమర్థించి మాజీ సీఎం జగన్ మళ్లీ తప్పు చేశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. రాజకీయాలకు సంబంధంలేని చంద్రబాబు భార్యను అసహ్యంగా దూషించడాన్ని తట్టుకోలేక అప్పట్లో ఆయన కంట కారిన ప్రతి కన్నీటి బొట్టుకు మూల్యం చెల్లించవలసి ఉంటుందన్నారు. అందులో భాగంగా అధికార మదంతో రెచ్చిపోయిన వల్లభనేని వంశీ ఇప్పుడు జైలు ఊచలు లెక్కపెడుతున్నారన్నారు. అతడి కోసం వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి జైలుకు వెళ్లడం, తన తోటి దొంగను కలిసినట్లు ప్రజలు భావించాలని గన్ని కృష్ణ పేర్కొన్నారు.

## గిరిజనులు అభివృద్ధి చెందాలి

**డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి**

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గిరిజనులు తమ హక్కులను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గిరిజన హక్కుల పరిరక్షణ, అమలు అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, నల్సా గిరిజన హక్కుల రక్షణ, అమలు పథకం గురించి వివరించారు. గిరిజనులకు ఎలాంటి సహకారం అవసరమైనా డీఎల్ఎస్ఏ అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని, కేవీ స్టేట్ హోం, బాల సదనాన్ని ఆమె సందర్శించి ఆహార వసతులను పరిశీలించారు.

## కుంభమేళాకు తరలిన 72 మంది భక్తులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు రాజమహేంద్రవరం డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సుల్లో 72 మంది భక్తులు బయలుదేరి వెళ్లారు. మంగళవారం డిపో ఆవరణలో ఈ బస్సులను డిపో మేనేజర్ షేక్ షబ్నం జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలో భక్తులకు భువనేశ్వర్, పూరి, కోణార్క్, గయా, బుద్ధగయ, వారణాసి, అయోధ్య, నైమిశారణ్యం, సీతామడి, అరసవిల్లి క్షేత్రాలు చూపిస్తారని, యాత్ర పూర్తి చేసుకుని మార్చి 2న భక్తులు తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటారని డీఎం తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలాజీదాస్‌కు నివాళులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కార్మిక పోరాట యోధుడు, మార్క్సిస్టు నేత జీఎస్ బాలాజీదాస్ 22వ వర్ధంతి సందర్భంగా మంగళవారం శ్యామలా సెంటర్‌లోని ఆయన విగ్రహానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ బాలాజీదాస్ కార్మికలోకం అభ్యున్నతికి చేసిన కృషి, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పవన్, ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



కడియం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కడియంలో మంగళవారం అనపర్తికి చెందిన రమాదేవి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ రమాదేవి, కడియం రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ప్రారంభించిన ఈ శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలుగుబంటి నాని,గట్టి నర్సయ్య, ముద్రగడ జమీ, పాటంశెట్టి రాంజీ, బత్తుల రాము, చిలుకూరి ప్రభాకర్, టి.ప్రసాద్ పాల్గొన్నారు.


## వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు

బిక్కవోలు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఊలపల్లిలో మంగళవారం ఎల్‌వీ ప్రసాద్ నేత్రాలయం కపిలేశ్వరపురం శాఖ నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 248 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు జరిపారు. వీరిలో 25 మందికి సగం ధరకు కళ్లజోళ్లు అందజేశారు. 11 మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని నేత్రాలయానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, కాకర్ల అశోక్, బండారు శివ, గ్రామ కార్యదర్శి అచ్చియ్యచౌదరి పాల్గొన్నారు.

## సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

| | |
|---|---|
| శ్యామల | : సంక్రాంతికి వస్తున్నాం |
| సూర్యామినీ | : కెప్టెన్ అమెరికా |
| సూర్యాప్యాలస్ | : చావా |
| స్వామి | : బ్రహ్మాఆనందం |
| శివజ్యోతి | : తండేల్ |
| అనుశ్రీ(సాయికృష్ణ) | : లైలా |
| రాజా | : సంక్రాంతికి వస్తున్నాం |
| ఊర్వశి | : కాంప్లికేటెడ్ |
| రంభ | : ఆరెంజ్ |
| మేనక | : నిదురించు జహాపన, తల |
| అప్సర | : తండేల్ |
| కుమారి | : కెప్టెన్ అమెరికా |
| అశోక | : లైలా |
| వీఎస్ మహల్(నామవరం) | : తండేల్ |
| మురళీకృష్ణ(ధవళేశ్వరం) | : తండేల్ |
| వెంకటసూర్య(కడియం) | : లైలా, తండేల్ |
| సత్యగౌరి (అనపర్తి) | : లైలా |
| సూర్యశ్రీ (అనపర్తి) | : తండేల్ |
| ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం) | : తండేల్ |
| రామకృష్ణ(కోరుకొండ) | : --- |
| గీతాసినిమాస్ (సీతానగరం) | : లైలా |
| శ్రీనివాస (గోకవరం) | : తండేల్ |
| టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం) | : లైలా |
| లలితామహాల్(రంపచోడవరం) | : తండేల్ |
| నవయుగ(చింతూరు) | : లైలా |




సత్తుపాటి ప్రసన్నశ్రీ


చేకూరి శివరామకృష్ణ ప్రసాద్

# ప్రజాస్వామ్యం ఖూ(తు)నీ!


ఉద్రిక్తత : తుని బాలాజీ కాంప్లెక్స్ వద్ద బారికేడ్లను తోసుకొస్తున్న కార్యకర్తలపై లాఠీచార్జి

ఓటమి పాలైనా వైసీపీ నాయకులు మారలేదు.. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సుమారు 17 మంది కౌన్సిలర్లను బంధించి గత రెండు రోజులుగా స్వేచ్ఛను హరిస్తున్నారు.. మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చినా భేఖాతర్ చేస్తున్నారు.. ఎన్నికలు జరిగే మునిసిపల్ కార్యాలయాన్ని ఆనుకుని ఎడమ వైపున ఉన్న చైర్మన్ నివాసంలో వైసీపీ కౌన్సిలర్లను బంధించారు. కళ్లెదుటే కౌన్సిలర్లు ఉన్నా వేలాదిగా ఉన్న పోలీసులు.. అధికారం చేతిలో ఉన్న కూటమి నాయకులు వారు ఎప్పుడొస్తారోనని ఎదురుచూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. తునిలో కళ్లెదుటే వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు..

## తునిలో వైసీపీ అరాచకీయం

- మళ్లీ వైసీపీ నేతల డ్రామాలు
- హాజరైన టీడీపీ కౌన్సిలర్లు
- వైసీపీ కౌన్సిలర్ల నిర్బంధం
- బయటకొచ్చిన కౌన్సిలర్లు
- లాక్కుపోయిన రాజా
- కోరం లేక మళ్లీ వాయిదా
- నాలుగోసారి అంతే
- తేలని వైస్ చైర్మన్ ఎన్నిక
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చలో తునికి వైసీపీ నేతలు
- అడ్డుకున్న పోలీసులు

కాకినాడ/ తుని రూరల్ (ఆంధ్రజ్యోతి) : మళ్లీ అదే సీను.. అదే డ్రామా.. ఎన్నికకు హాజరైతే ఓడిపోతామనే భయంతో అవే కుయుక్తులు.. కౌన్సిలర్ల నిర్బంధాలు.. అడుగు పెట్టనీయకుండా వారిపై ఆంక్షలు.. చివరకు మళ్లీ నాలుగోసారీ వాయిదా.. వైసీపీ డ్రామాలతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఎటూ తేలకుండా సా..గుతోంది. చివరకు మంగళవారమైనా ఉత్కంఠకు తెరపడుతుందని భావిస్తే మళ్లీ సేమ్.. వైసీపీ తీరుతో కోరం లేని కారణంగా వాయిదా.. దీంతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎప్పటికి పూర్తవుతుందోనన్న ఆందోళన.. చలో తునికి అనుమతి లేకపోయినా పలువురు వైసీపీ నేతలు ఇంకో డ్రామాకు తెరలేపగా పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపారు.

### మళ్లీ అదే రిపీటు..

తుని మునిసిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రోజు రోజుకు ఉత్కంఠభరితంగా మారుతోంది. కోరం లేక సోమవారం ఎన్నిక రద్దవగా, తిరిగి మంగళవారం కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. వాస్తవానికి తునిలో ఖాళీ అయిన వైస్ చైర్మన్ ఎన్నికకు ఈనెల 3న నోటిఫికేషన్ జారీ అయింది. వైసీపీ డ్రామాల కారణంగా ఈనెల 3,4 తేదీల్లో జరగాల్సిన ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. తాజాగా కోర్టు ఆదేశాలతో సోమవారం ఎన్నికకు వీలుగా అధికారులు కౌన్సిలర్లను ఆహ్వానించారు. టీడీపీ నుంచి పది మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాగా వైసీపీ కౌన్సి లర్లు 17 మందిని ఆ పార్టీ నిర్బంధించి ఓటిం గ్‌కు రాకుండా చేసింది. కోరం లేకపోవడంతో ఎన్నికను రద్దు చేసి మంగళవారం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.దీంతో మంగళవారం ఉదయం 11 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు 10 మంది ఎన్నికకు హాజరయ్యారు. వైసీపీ కౌన్సిలర్లు వస్తారని అంతా భావించారు. కానీ వైసీపీ తన డ్రామాను మళ్లీ కొనసాగించింది. ఉదయం 8 గంటలకే తమ కౌన్సిలర్లను వైసీపీ మునిసిపల్ చైర్మన్ నివాసానికి తరలించింది. కాసేపటికే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అక్కడకు చేరుకుని ఎన్నికకు వెళ్లొద్దంటూ బెదిరించారు. మరో పక్క ఉదయం 10 గంటలు అవగానే తుని టీడీపీ కార్యకర్తలు,నాయకులు మునిసిపాలిటీ వద్దకు చేరుకున్నారు. వీరిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కొందరు వైసీపీ కౌన్సిలర్లను దాచిపెట్టిన చోటు వైపు వెళ్లే ప్రయత్నం చేయగా పదుల సంఖ్యలో పోలీసులు మోహరించి బారికేడ్లు అడ్డంపెట్టేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. సరిగ్గా ఉదయం 10:30 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు పది మంది మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వీరి ధ్రువీకరణ పత్రాలను సరిచూసి అధికారులు 11 గంటలకు లోపలకు పంపారు. కానీ వైసీపీ కౌన్సిలర్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని వైసీపీ కౌన్సిలర్లు ఉన్న ప్రాంతం వైపు చొచ్చుకు వెళ్లడానికి పరుగులు తీశారు. వైసీపీ కౌన్సిలర్లను నిర్బంధించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ ఉన్న వైపు టీడీపీ శ్రేణులు దూసుకువెళ్లే ప్రయత్నం చేశాయి. ఎన్నికకు కౌన్సిలర్లను పంపాలని వైసీపీని నిలదీసేందుకు టీడీపీ నేతలు పలుసార్లు ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ శ్రేణుల వైపు దూసుకురావడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఘర్షణ నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.


మేము ఇక్కడే ఉన్నాం : చైర్‌పర్సన్ నివాసం నుంచి బయటకొచ్చిన వైసీపీ కౌన్సిలర్లు

### ఇలా రాగానే.. అలా లాక్కుపోయారు..!

ఎన్నిక మరికాసేపట్లో ప్రారంభం కానుండగా వైసీపీ కౌన్సిలర్లు కొందరు నిర్బంధం నుంచి బయటకొచ్చి సమావేశానికి వచ్చే ప్రయత్నం చేశారు. టీడీపీ నేతలు వారి వైపు దూసుకెళ్లారు. గమనించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ వారిని తమ మనుషులతో లోపలకు లాక్కుపోయారు. సమయం 12 గంటలు దాటిపోయినా వైసీపీ కౌన్సిలర్లు రాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేశారు.


మేము వచ్చేశాం : హాజరైన టీడీపీ కౌన్సిలర్లు

### ఇక ఈసీ నిర్ణయమే..

మళ్లీ ఎప్పుడు ఎన్నిక జరుగుతుందనేది ఈసీ నిర్ణయిస్తుందని అధికారులు వివరించారు. ఇప్పటికే ఎన్నిక నాలుగుసార్లు వాయిదా పడడంతో ఈ విషయాన్ని కలెక్టర్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో రెండు సార్లు కోరం లేక వాయిదాపడినందున తదుపరి నిర్వహించే ఎన్నిక కోరంతో సంబంధం లేకుండా నిర్వహించొచ్చా? లేదా?అనే దానిపై ఈసీ త్వరలో నిర్ణయించే అవకాశం ఉంది.


అనుమతి లేదన్నా వచ్చేసి : నేలపై బైఠాయించి ద్వారంపూడి, కన్నబాబు, ఇతర వైసీపీ నాయకుల నిరసన

### చలో తుని.. మరో డ్రామా..

ఒక పక్క ఎన్నిక జరగకుండా అడ్డుకుంటున్న వైసీపీ.. మంగళవారం చలో తునికి రావాలంటూ దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. పోలీసులు చలో తునికి అనుమతి లేదని తెగేసి చెప్పారు. తొలుత కిర్లంపూడి నుంచి ముద్రగడ పద్మనాభరెడ్డి తునికి బయలుదేరగా తుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో పోలీసులు అడ్డుకోగా వెనుదిరిగి వెళ్లిపోయారు. అటు మాజీ ఎంపీ వంగా గీత తునిలో హల్‌చల్ చేశారు. అనుమతి లేదని చెప్పినా రాజా వద్దకు వెళ్లి కౌన్సిలర్లతో మాట్లాడారు. కాకినాడ నుంచి మాజీ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు తునికి వెళ్లే ప్రయత్నం చేయగా గొల్లప్రోలు హైవేపై పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా తుని వచ్చిన మాజీ ఎంపీ వంగా గీతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తునిలో గొడవలు జరిగే అవకాశం ఉండడంతో నియోజకవర్గంలో మాజీ మంత్రి దాడిశెట్టితోపాటు పలువురు నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

## రెండు వర్సిటీలకు వీసీల నియామకం

కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థను గాడిలో పెట్టే చర్యలకు దిగింది.. ఎట్టకేలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు మంగళవారం వీసీ (వైస్ చాన్సలర్ల) నియామకం చేపట్టింది.. కాకినాడలో ఉన్న జేఎన్‌టీయూకే వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ జిల్లా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు.. గుంటూరు జిల్లాకు చెందినవారు. ఇక తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఉన్న నన్నయ వర్సిటీ వీసీగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం విశాఖపట్నం ఏయూలో ఆంగ్ల విభాగ ప్రొఫెసర్‌గా ఉన్నారు.. 19 గిరిజన భాషలకు లిపి రూపొందించి 2022లో అప్పటి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారం అందుకున్నారు. వీరిద్దరూ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. - వివరాలు 7లో



## ప్రకృతి వ్యవసాయంలో 7,300 మంది

### దొమ్మేరులో పరిశీలించిన కలెక్టర్

కొవ్వూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయవచ్చునని కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో రైతు నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ సాగును వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు.12 ఎకరాల పొలంలో చెరకు, బొప్పాయి, మొక్కజొన్న, నువ్వులు, అరటి, కోకో, కొబ్బరి, కంద, డ్రాగన్ ఫ్రూట్, జామ రకాల పంటలను సాగు చేయడంపై అభినందించారు. డ్రోన్ సహాయంతో కషాయం పిచికారి చేసే విదానాన్ని స్వయంగా వీక్షించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 42 వేల ఎకరాల్లో 7300 మంది రైతులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, కొవ్వూరు ఆర్డీవో డా.రాణి సుస్మిత, కొవ్వూరు ఏపీసీఎన్ఎఫ్, డీపీఎం బి.తాతారావు, అదనపు డీపీఎం మహబూబ్ వలీ, వ్యవసాయశాఖ ఏడి పి.చంద్రశేఖర్ రైతులు పాల్గొన్నారు.

## జీబీఎస్ అంటువ్యాధి కాదు డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి



కొవ్వూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జీబీఎస్ వ్యాధిని సమయానికి గుర్తించి చికిత్స అందిస్తే కోలుకుంటారని డీసీహెచ్ఎస్ డా.ఎన్.పద్మశ్రీరాణి అన్నారు. కడియం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం సీహెచ్‌సీలు,అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు, వైద్యులతో మంగళవారం సమీక్షించారు.జీబీఎస్ వ్యాధి (గిల్లియన్ బరే సిండ్రోమ్) ఒక అరుదైన నాడీ సంబంధిత వ్యాధి.మన శరీరపు రోగ నిరోధక వ్యవస్థ పొరపాటుగా మన నరాలపై దాడి చేయడం వల్ల కలుగుతుందన్నారు.కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల తర్వాత వ్యాధి వస్తుందన్నారు.వ్యాధి సోకితే చేతులు, కాళ్లలో నిస్సత్తువ. కాలి వేళ్ల నుంచి పైభాగానికి వస్తూ పెరిగే బలహీనత. కొన్ని సార్లు శ్వాస సమస్యలు తలెత్తుతాయన్నారు.మహారాష్ట్ర,కర్ణాటక,ఏపీలలో అత్యధికకేసులునమోదయ్యాయన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదన్నారు.ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించి సురక్షిత నీరు తాగాలన్నారు.

### ఒక జీబీఎస్ అనుమానిత కేసు కాకినాడకు పంపించాం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అనుమానిత లక్షణాలతో కాకినాడకు తరలించిన వ్యక్తికి సంబంధించి వ్యాధి నిర్ధారణపై ఎటువంటి అధికారిక వైద్య నివేదిక అందుబాటులో లేదని జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ పేర్కొన్నారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యికి చెందిన సదరు వ్యక్తి ఆరోగ్యపరిస్థితిని నిరంతరం గమనిస్తూనే ఉన్నామని తెలిపారు. ఆయన పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. జీటీజీహెచ్‌కు వచ్చిన రెండు కేసుల్లో ఒక దాన్ని అనుమానిత కేసుగా గుర్తించి న్యూరాలజిస్ట్ సలహా మేరకు ఈనెల 14న కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశామన్నారు.

### నేడు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్‌ఈ) ఎస్.శాంతి ప్రియ తెలిపారు. జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న పెన్షన్,జీపీఎఫ్ కేసులను సమీక్షిస్తామన్నారు. జిల్లాలో అధికారులు పెండింగ్‌లో ఉన్న కేసులు, అనుబంధ సమస్యలకు సంబంధించిన వివరాలతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఖజానా అధికారి ఎస్.సత్యనారాయణ కోరారు.

## రైతుకు గిట్టుబాటు ధర ఇప్పించాలి

### ఉమ్మడి జిల్లా రైతుబజార్ల ఎస్టేట్ అధికారులతో జేడీ సుధాకర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులను ఆదుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ అన్నారు. రాజమహేంద్రవరం ఏఎంసీ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మార్కెటింగ్‌శాఖ అధికారులు, రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు, మార్కెట్ కమిటీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. కూరగాయల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో వంకాయలు, టమోటా, కేబేజీ తదితర కూరగాయల దిగుబడులు గణనీయంగా పెరిగాయని..రేటు పడిపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. జిల్లాల్లో వాటి లభ్యతను బట్టి మార్కెట్‌లో రైతుకు రేటు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రైతు ఎవరైనా సరే వారు పండించే పంటకు బహిరంగ మార్కెట్లలో గిట్టుబాటు ధర రానప్పుడు మార్కెటింగ్‌శాఖ వారి ఉత్పత్తులను రైతుబజార్లలో విక్రయించుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ మేరకు మార్కెటింగ్, ఎస్టేట్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్, కాకినాడ జిల్లా ఏడీఎం రాఘవేంద్రరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏడీఎం విశాలాక్షి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



### సాయుధ బలగాల కవాతు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణం పోలీసు కవాతు మైదానంలో మంగళవారం సాయుధ బలగాల వార్షిక డీ-మోబిలైజేషన్ కవాతు నిర్వహించారు.గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ సాయుధ బలగాలు అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా వ్యవహరించడానికి,వృత్తి నైపుణ్యం మెరుగు పరిచి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి డీ-మోబిలైజేషన్ శిక్షణ ఉపకరిస్తుందన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మురళీకృష్ణ,అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్.అర్జున్,అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్.చెంచి రెడ్డి పాల్గొన్నారు.

### నిర్లక్ష్యంపై వేటు

రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు.. ఐదుగురు ఉద్యోగులు సస్పెన్షన్

స్టాక్ మార్కెట్ పేరుతో రూ.14 లక్షలకు టోకరా
టీబీ ముక్త్ పంచాయతీల క్లెయిమ్స్ వెరిఫికేషన్ 8

## ప్రాణాలు పోతున్నా..


హృదయ విదారకం : పండ్ల మార్కెట్ వద్ద లారీ ఢీకొనడంతో సోమవారం రోడ్డు పక్కనే మృతిచెంది పడి ఉన్న తోటి కోడళ్లు

ఒక ప్రమాదం.. ఇద్దరు మృతి.. మృతదేహాలను తరలించేశారు.. కేసు నమోదు చేశారు.. అక్కడితో అయిపోయిందంతే..! అసలు ప్రమాదం జరగడానికి కారణం .. కారకులు ఎవరు.. అనేది అధికారులు తేల్చడం లేదు.. సోమవారం దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన తోడికోడళ్లు మృతిచెందిన ఘటన విధితమే.. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి.. ప్రాణాలు పోతూనే ఉంటాయి. అటూ ఇటూ లేదంటే నెలకూ సుమారు 100 వరకూ ప్రమాదాలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది అధికార యంత్రాంగం ఉన్నా.. ఒక్కరూ ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలు మాత్రం శూన్యం.. ఇక్కడ ప్రమాదాలు జరగడానికి అసలు కారణం ఏంటో తెలుసా.. ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడమే!

# పట్టదా!?

### ప్రమాదకరంగా దివాన్‌చెరువు జంక్షన్

- ప్రతి నెలా పెరుగుతున్న ప్రమాదాలు
- సర్వీసు రోడ్లు లేకపోవడమే కారణం
- ఆందోళనలో ప్రయాణికులు
- కన్నెత్తి చూడని అధికారులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు మాత్రం పట్టడంలేదు.. షరా మామూలే అన్నట్టు వదిలేస్తున్నారు. ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలు మాత్రం శూన్యంగా ఉంటున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ప్రయాణం ఆందోళన కలిగిస్తోంది. వివిధ పట్టణాలు, నగరాలను కలిపే ఈరహదారిపై రేయింబవళ్లు వాహనాలు రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది.

### జీరో జంక్షన్..టెన్షన్..

దివాన్‌చెరువు సమీపంలో జీరో జంక్షన్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తే ఆందోళన కలగక మానదు. విజయవాడ నుంచి దివాన్‌చెరువు వైపు గామన్‌వంతెన మీదుగా ప్రయాణించే వాహనాలన్నీ ఈ జీరో జంక్షన్ వద్ద మలుపు తిరుగుతాయి. అలాగే రాజమహేంద్రవరం వైపు నుంచి దివాన్‌చెరువు వైపునకు వచ్చే అన్ని వాహనాలు ఈ జీరో జంక్షన్ వద్ద గామన్ వంతెన మీదుగా వచ్చే వాహనాలతో కలుస్తాయి. దీంతో ఇక్కడ ప్రమాదకరంగా ఉంది.ఏ క్షణం ఎటువంటి ప్ర మాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.


అటూ..ఇటూ : దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద అయోమయం

### కానరాని సర్వీస్ రోడ్లు..

జిల్లా కేంద్రం రాజమహేంద్రవరాన్ని ఆనుకునే దివాన్‌చెరువు జంక్షన్ ఉంటుంది.దివాన్ చెరువు జీవో జంక్షన్ నుంచి రాజానగరం వరకూ సుమారు 5 కిలోమీటర్లు జాతీయ రహ దా రిపై ప్రయాణంపై ప్రమాదకరంగా ఉంటుంది. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉం టుంది..ఎవరో ఒకరి ప్రాణాలు గాలిలో కలిసి పోతూనే ఉంటాయి..ఈ రహదారిలో సర్వీస్ రోడ్లు లేకపోవడమే ప్రమాదాలకు కారణంగా వాహనదారులు చెబుతున్నారు. సర్వీస్ రోడ్డుకు అటూ ఇటూ స్థలం ఉన్నా ఆ దిశగా ఆలోచించే వారే కరువయ్యారు.దీంతో ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్ దివాన్‌చెరువు జాతీయ రహదారి మారింది.

### రోడ్డు పక్కనే పార్కింగ్..

దివాన్‌చెరువు మార్కెట్ నిత్యం రద్దీగానే ఉంటుంది.జాతీయ రహదారిని ఆనుకుని అటూ ఇటూ 200 పైబడి షాపులు ఉంటాయి. ఆయా షాపుల వద్దకు వచ్చిన జనం జాతీయ రహదారి పక్కనే వాహనాలు పార్కింగ్ చేసి వదిలేస్తారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు పక్కకు తప్పుకుందామన్నా దారుండదు. జాతీయ రహదారిపై వచ్చే వాహనాలు ఢీకొని ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. సోమవారం తోడికోడళ్ల మృతి సంఘటన కూడా అటువంటిదే.. బైక్‌పై ముగ్గురు వెళుతుంటే వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో తోడికోడళ్లు అక్కడికక్కడే మృతిచెందారు. అదే సర్వీస్ రోడ్డు ఉండి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఈ రహదారిలో ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాల సంఖ్య తక్కువేం కాదు. అయినా పోలీసుల చర్యలు మాత్రం శూన్యం.


ఇలాగైతే జరగవా ప్రమాదాలు : పండ్ల మార్కెట్ వద్ద రోడ్డు పక్కగానే వాహనాల పార్కింగ్

### ఫ్లయ్ ఓవర్ మాటేది..

దివాన్‌చెరువు జంక్షన్‌లో ఫ్లయ్ ఓవర్ వేస్తామని గతంలో హామీ ఉంది. అది అమలుకు నోచు కోలేదు. దాదాపు పదేళ్ల కిందట ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాడు రోడ్డు పక్కనే ఉన్న భవన యజమానులు కొందరికి పరిహారం ఇచ్చేసి మార్కింగ్ కూడా చేసేశారు. అయితే నేటికీ కదలిక లేదు.. ఫ్లయ్ ఓవర్ నిర్మాణం టెండర్ల దశలో ఆగిపోయినట్టు సమాచారం. ఈ జంక్షన్‌లో గతంలో ఎంపీ పురందేశ్వరి కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితురాలికి సపర్యలు చేసి ఫ్లయ్ ఓవర్ నిర్మాణంపై దృష్టి పెడతామని అన్నారు. అయితే నేటికీ కదలిక లేకపోవడం గమనార్హం.

## గర్భిణులకు సేవలు అందించాలి : డీఎంహెచ్‌వో


మలకపల్లి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): మలకపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డా. కే.వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆసుపత్రిలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్షిస్తూ వైద్యాధికారికి పలు సూచనలు చేశారు. గర్భిణులకు అన్నిరకాల సేవలు సకాలంలో అందించాలని పేర్కొన్నారు. అలాగే పీహెచ్‌సీలో ప్రతినెలా ఐదు ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం పెద్దేవంలో జరుగుతున్న ఎన్‌సీడీసీడీ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీసీడీ జిల్లా మోనటరింగ్ అధికారి డా. జీ.హరి చంద్రప్రసాద్, డాక్టర్ ఎం. షమ్మి కుమార్, డా. పి. సుచందన, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'ముళ్లపూడి' జన్మదిన వేడుకలు


నల్లజర్లలో అనాథ పిల్లలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న సుబ్బారావు

నల్లజర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నల్లజర్లకు చెందిన టీడీపీ ఉపాధ్యక్షుడు గుదే వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా అనాథ హాస్టల్ విద్యార్థుల సమక్షంలో కేక్‌కట్ చేశారు. అనంతరం వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 5 వేలు విలువ చేసే సిరంజీలను గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత వల్లూరి సత్తిపండు, రావూరి రమణ, ఆళ్లపాటి రామకృష్ణ అందించారు. పోతవరం,దూబచర్ల,ఘంటావారిగూడెం,అనంతపల్లి,చీపురుగూడెం,చోడవరంలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విడియాల శ్రీనివాస్, గుంటుముక్కల వేణు, కొయ్యలమూడి నాగార్జున, సవలం రామకృష్ణ, గుదే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది మృతిపై బార్ అసోసియేషన్ సంతాపం


సంతాపం వ్యక్తం చేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నిడదవోలు, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): న్యాయవాది తిగిరిపల్లి సుబ్బారావు ఆకస్మిక మృతి న్యాయవాదులకు తీరని లోటని బార్ అసోసి యేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది సీహెచ్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరుకు చెందిన న్యాయవాది సుబ్బారావు ఆకస్మిక మృతికి సంతాపం తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఎం.అర్జునుడు, చాపల సుబ్బారావు, మహేష్, ఎండీ కమల్‌బాబు, పీ.వీరాంజనేయ చౌదరి, ఏఎస్ విశ్వనాథం పాల్గొన్నారు.

## పశువులకు బీమా చేయించుకోవాలి


చాగల్లు, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): ఒక ఈత ఈనిన ఆవులు, గేదెలకు సంబంధించిన రైతులు తప్పక పశు బీమా చేయించుకోవాలని మండల పశువైద్యాధికారి యు. ముఖేష్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ పశువుల జాతి, వయస్సు, పాల దిగుబడి, ఆరోగ్య పరిస్థితిని బట్టి బీమా నమోదు, ప్రీమియం చెల్లింపు ఉంటాయని చెప్పారు. ఒకసారి చెల్లిస్తే మూడు సంవత్సరాల పాటు బీమా సౌకర్యం అమలులో ఉంటుందన్నారు. రైతులు ఈ నమోదు కోసం ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, తెల్లరేషన్ కార్డు, ఎస్సీ, ఎస్టీ కులాల వారు కులధ్రువీకరణ పత్రాల జిరాక్సులను కలిపి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## అనుమానితుల పట్ల అప్రమత్తత అవసరం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో అనుమానితులు సంచరిస్తే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కాల్దరిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్ చీపుళ్ల కుమారి, ఉపసర్పంచ్ ఈర్పిన సత్యనారాయణ, స్థానిక నేతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని గెలిపించాలి

● ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


న్యాయవాదులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం పట్టణంలోని పలు కార్యాలయాలు, విద్యాసంస్థలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల, జూనియర్ కళాశాల, కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులను, ఫైర్‌స్టేషన్, పోలీస్‌స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల, తహశీల్దార్ కార్యాలయాలలోఉద్యోగులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, క్లస్టర్ ఇంచార్జి పెనుమాక జయరాజు, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పల్లంట్లలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

**దేవరపల్లి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి కొయ్యల మూడి సుధారాణి ఉపాధ్యాయులను కోరారు. పల్లంట్ల జడ్పీ హైస్కూల్‌లో మం గళవారం రాజశేఖర్‌కు ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతాల దాసు, నలమాటి నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాస్, ఆలపాటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


వేగేశ్వరపురం ప్రచారంలో ఎమ్మెల్యే, కూటమి నాయకులు

**తాళ్లపూడి:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం కూటమి నాయ కులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. వేగేశ్వరపురం జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ కార్యాంలయాల్లోని ఉద్యోగులను కలిసి కూటమి అభ్యర్థి పేరాబ త్తుల రాజశేఖర్‌కు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.అనంతరం బల్లిపాడు, పెద్దేవం, మలకపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గల ఉద్యోగులను కలిసి ఓటువేయాలని కోరారు. కార్యక్ర మంలో సూరపనేని చిన్ని, నామన పరమేశ్వరరావు, కైగాల శ్రీనివాస్, దుగ్గి రాల జగదీష్, మద్దుకూరి శంకరం, ఉప్పులూరి రమేష్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ బీజేపీ పరిశీలకుడు దాసరి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం తాడిపర్రు, తదితర గ్రామాల్లో ఓటర్లను కలసి మొదటి ప్రాధ్యానత ఓటు వేయాలని అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని చూడాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పిసీడి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిన గోపాలకృష్ణ, టీడీపీ నాయకుడు అక్కిన సుధీర్, జనసేన నాయకుడు జవ్వాది వినయ్, సాంబ, తదితరులు పాల్గొన్నారు.


తాడిపర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

## నిర్లక్ష్యంపై వేటు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగు రు డాక్టర్లు, ఐదుగురు కార్యాలయ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విజయవాడలోని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సుభాష్ ఆదేశించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ తక్షణమే స్పందించి మంగళవారం ఈచర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆసుపత్రిని సోమవారం మంత్రి సుభాష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సమయంలో కొందరు వైద్యులు, కార్యాలయ సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. హాజరుపట్టీని ఆయన పరిశీలించారు. కొందరు డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది హాజరు నమోదు చేసుకుని విధులు నిర్వర్తించకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోతున్నట్టు గుర్తించారు. అక్కడున్న మరికొందరు సరైన సమాధానం, సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి సుభాష్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్‌ను ఆదేశించారు. దీంతో విధినిర్వహణలో బాధ్యతారాహిత్యంగావ్యవహ రించిన డాక్టర్లు, సిబ్బందిపై వేటు పడింది. కాగా, దీనిపై విచారణ కొనసాగుతోందని, నివేదిక ఆధారంగా మరిన్నిచర్యలు తీసుకుంటామని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఒకప్రక టనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఈఎస్‌ఐబీమా చందాదారులు, వారి కుటుంబీకులకు నాణ్యమైన వైద్యసేవలందజేసేందుకు కట్టుబడి ఉంద ని, రోగుల విషయంలో నిర్లక్ష్యం, క్రమశిక్షణారా హిత్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

## రైతుకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి : ఏవో

గోపాలపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో రాజారావు అన్నారు. మంగళవారం దొండపూడి, రాజంపాలెంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకున్నట్టయితే ప్రభుత్వ పథకాలను పొందవచ్చన్నారు. రైతులు వారి ఆధార్‌కార్డు, భూమి వివరాలను సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సమర్పిం చాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ ఉద్యాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటరు స్లిప్పులు సిద్ధం

● ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో

తాళ్లపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటరు స్లిప్పులే సిద్ధం చేశామని ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీఆర్‌వోలు, బీఎల్‌వోలు గ్రామాల వారీగా అందిస్తారన్నారు. ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 1935 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని, వారి కోసం మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాటిలో తాళ్లపూడి జడ్పీ హైస్కూల్లో రెండు, తాళ్లపూడి సచివాలయంలో ఒకటి ఉన్నాయన్నారు.

# అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు


నిడదవోలులో మాట్లాడుతున్న తహశీల్దార్ నాగరాజు నాయక్

నిడదవోలు, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సంరక్షణ, విద్య, పునాదే లక్ష్యంగా చేపట్టిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్ వాడీలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బీ. నాగరాజు నాయక్ సూచించారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ మాట్లాడుతూ విద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ ఎంతో విలువైనదన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పీ.నళిని, యూ. పద్మ, ఎంఈవోలు కేఎస్‌వీ గణేష్, పీ.గురుమూర్తి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** మండలంలోని 79 అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. స్థానిక అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్లో జరిగింది. ఎంఈవోలు ఎం.తిరుమల దాసు, కేఆర్ఎస్‌వీబీ అప్పారావు హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిక్షణ ఆరురోజుల పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలక్ష్మి, సీడీపీవో నాగలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, ఎం. శశికళ, పీ.విజయశాంతి,తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈవోలు తిరుమల దాసు, అప్పారావు

**గోపాలపురం:** స్థానిక జడ్పీ హైస్కూల్లో అంగన్వాడీ కార్యకర్తలకు ఈనెల 18వ తేదీ నుంచి 25 వరకు శిక్షణ ఇస్తున్నట్టు సీడీపీఓ కే.నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మాట్లాడుతూ 120 రోజుల పాటు సర్టిఫికెట్ కోర్సుని సంవత్సరానికి 40 రోజుల చొప్పున మూడు సంవత్సరాల్లో శిక్షణ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం 12 రోజుల పాటు ప్రత్యక్ష శిక్షణ, మిగతా 28 రోజులు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం నాలుగురోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు జేవీ రమణ, విజయకుమారి, రిసోర్స్ ఎర్సన్లు నాగేశ్వరరావు, ఉచ్చుల బాలాజీ, సీఆర్‌పీ కొయ్య నాగరాజు, లక్ష్మణ్, సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**చాగల్లు:** పిల్లల అభ్యసన నైపుణ్యాలు పెంచుకొనే విధంగా వారికి తగిన శిక్షణ ఇవ్వాలని ఎంఈవో యు. గురునాథం అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి. పద్మావతి, జి. శిరీష, ప్రధానోపాధ్యాయుడు మోహనకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం/పెరవలి:** అంగన్‌వాడీ పిల్లలకు నైతిక, మానసిక పెరుగుదలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఉండ్రాజవరంలో అంగన్‌వాడీ వర్కర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు పునాది అభ్యసన మెరుగుపర్చడానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని వివరించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, ఎంఈవో సక్సేనరాజు, డీఆర్‌పీలు వైకే విశ్వనాథం, టీ. శ్రీనివాస్, సూపర్‌వైజర్లు ఎం. భాగ్యలక్ష్మి, ఎం. బాలసరస్వతి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కే.మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు. పెరవలిలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ అచ్యుతకుమారి, ఎంఈవో షేక్ సూర్జాన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


చాగల్లు హైస్కూల్లో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో గురునాథం


ఉండ్రాజవరంలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

## చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



చాగల్లు, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): కలవలపల్లికి చెందిన జాస్తి శశిరేఖ (60) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఎస్‌ఐ కే. నరేంద్ర తెలిపిన వివరాలివి. 11 సంవత్సరాల వయసు కలిగిన మనవడు ఆడుకోవడానికి వెళ్లి సాయంత్రం ఆలస్యంగా ఇంటికి రాగా నానమ్మ అయిన శశిరేఖ మందలించింది. దీంతో సదరు బాలుడు క్షణికావేశంలో పక్కనే ఉన్న సుత్తితో తలపై మోదడంతో తీవ్ర గాయమైంది. వెం టనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ దాదాపు 50 రోజులు చికిత్స పొం దుతూ కన్నుమూసింది. రెండు నెలల క్రితం జరిగిన సంఘటనకు సంబంధించి డిసెంబరు 15న కేసు నమోదు చేశారు. శవపంచనామా కోసం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

## రీ సర్వేలో అలసత్వం వద్దు : జేసీ చినరాముడు


చిన్నాయిగూడెంలో పనులు పరిశీలిస్తున్న జేసీ చినరాముడు

దేవరపల్లి, ఫిబ్రవరి 18 ఆంధ్రజ్యోతి: భూ రీ సర్వేలో తప్పులు దొర్లకుండా పారదర్శకంగా సర్వే చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్. చినరాముడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చిన్నాయిగూడెంను ప్రత్యేక ప్రాజెక్టుగా తీసుకొని రీసర్వేను ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి పనులను పరిశీలించి మాట్లాడారు. రీ సర్వేకు మూడురోజులు ముందుగా నోటీసులు అందించాలన్నారు. అలా నోటీసులు రైతులకు ఇచ్చారా అని రెవెన్యూ సర్వేయర్లను ప్రశ్నించగా, ఇంకా ఇవ్వలేదని చెప్పడంతో వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. భూ సర్వే జరిగేటప్పుడు తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే చేపట్టాలన్నారు. రాళ్లు లేనిపక్షంలో అక్కడ మార్కు చేసి రైతు సమక్షంలో రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వారంలో రెండురోజులు శని, ఆదివారాలు గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. రైతులు పట్టాదారు పుస్తకాలను డాక్యుమెంట్‌ను పరిశీలించి రెవెన్యూ రికార్డుల్లో సరిచూడాలన్నారు. రైతులకు నోటీసుల ద్వారా మొబైల్‌లో వాట్సప్‌ల ద్వారా కూడా తెలియజేయాలని చెప్పారు. ఈ సర్వేను కొవ్వూరు ఆర్డీవో సుస్మి తరాణి పరిశీలించారు. గత తప్పులు మళ్లీ జరగకుండా చూడాలన్నారు. తహశీల్దార్ ఎం.రాజ్యలక్ష్మి, తహశీసీల్దార్ వెంకటేశ్వరరావు, సర్వేయర్ డిల్లేష్, వీఆర్వోలు, రైతులు సుంకవల్లి వీరవెంకట సత్యవరప్రసాద్, పిన్నమనేని సత్యనారాయణ, చిలకా రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాలినడకన పట్టిసం వెళ్లే భక్తులకు బాట

● మహాశివరాత్రి ఏర్పాట్లపై ఎమ్మెల్యే బత్తుల, రుడా ఛైర్మన్ బీవీఆర్ సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బీవీఆర్, నీరుకొండ

సీతానగరం, ఫిబ్రవరి 18( ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి పట్టసం వెళ్లే భక్తుల కోసం వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద చేయవలసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నియోకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలుశాఖల అధి కారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నీరు తక్కువగా ఉన్నందున భక్తులు కాలినడకన గోదావరి దాటడానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బలరామకృష్ణ అన్నారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయం, గోదావరి పాయ వద్ద బారికేడ్లు, భక్తులకు మరుగుదొడ్లు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

కార్యక్రమంలో పెందుర్తి అచ్యుతరామారావు, గద్దే సురేష్, చిట్టూరి రంగారావు, గుర్రం ఉదయభాస్కరరావు, ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు

## టీబీ ముక్త్ పంచాయతీ క్లెయిమ్స్ వెరిఫికేషన్ ప్రారంభం

● జిల్లాలో 107 పంచాయతీల క్లెయిమ్స్ సమర్పణ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : టీబీ ముక్త్ పంచాయతీ క్లెయిమ్స్‌కు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని రాజవోలు పంచాయతీ, వెంకటనగరం పంచాయతీ క్లెయిమ్స్‌ను జిల్లా అబ్జర్వర్ల బృందం పరిశీలించాయని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మంగళవారం వెరిఫికేషన్ ప్రాసెస్ ప్రారంభమైందని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు నేతృత్వంలో అదనపు వైద్యాధికారిణి డాక్టర్ వసుంధర, జిల్లా పంచాయతీ అధికారిణి శాంతిమణి, ప్రభుత్వ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నుంచి డాక్టర్ సురేంద్ర, ఐఎంఏ నుంచి డాక్టర్ గురుప్రసాద్, సభ్యులు వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, టీబీ సూపర్‌వైజర్, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ పాల్గొనాల్సి ఉంటుంది. కాగా 2024 సంవత్సరానికి తూర్పుగోదావరి జిల్లా నుంచి 107 పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయతీలకు క్లెయిమ్స్ సమర్పించాయని, వీటిలో 77 సిల్వర్ మెడల్ కోసం, 29 బ్రాంజ్ మెడల్ కోసం పోటీ పడుతున్నాయని డీఎంహెచ్‌వో తెలిపారు.

## స్టాక్ మార్కెట్ పేరుతో టోకరా

● రూ.14.92 లక్షల ఆన్‌లైన్ దోపిడీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నారాయణపురానికి చెందిన బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసే బి.శ్రీనివాస్ వ్యక్తి స్టాక్ మార్కెట్ పేరుతో వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి పెట్టుబడి పెట్టి రూ.14.92 లక్షల నగదు పోగొట్టుకున్నాడు. ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ 2024 డిసెంబర్‌లో తన ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు అవుతుందనే సందేశాన్ని చూసి దఫదఫాలుగా రూ.14లక్షల 92వేలు పెట్టుబడి పెట్టారు. దానికి సంబంధిచి సుమారు రూ.40 లక్షలు నగదు అతడికి రావాల్సిందని మెసేజ్‌లో చూపించింది. అయితే తనకు రావాల్సిన డబ్బుల కోసం సదరు ఆన్‌లైన్‌లో ప్రయత్నించగా వారు అకౌంట్ క్లోజ్ చేశారు. దీంతో బాధితుడు మంగళవారం ప్రకాష్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.